RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 252 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 అక్టోబర్ 2024 గురువారం పేజీలు : 4

## ప్రాణాలు తోడేస్తున్న వాయుకాలుష్యం

న్యూఢిల్లీ : వాయుకాలుష్యం పలు రకాల ఆరోగ్య సమస్యలను తెచ్చి పెట్టటమే కాదు.. ఏకంగా ప్రాణాలనే హరిస్తోంది. మన దేశంలో ప్రధాన నగరాల్లో రోజువారీ సంభవించే మరణాల్లో సగటున 7.2 శాతం మరణాలు వాయుకాలుష్యం వల్లనే సంభవిస్తున్నాయని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. ఈ నగరాల్లో హైదరాబాద్ కూడా విశేషం. 'లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్'లో ఈ అధ్యయనం వివరాలు ప్రచురితమయ్యాయి. వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీ, ఢిల్లీలోని సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజెస్ కంట్రోల్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన పరిశోధన సంస్థలతో కూడిన ఒక బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, అహ్మదాబాద్, హైదరాబాద్, కోల్‌కతా, పుణె, షిమ్లా, వారణాసిల్లో పరిశోధకులు.. పీఎం 2.5 వాయుకాలుష్యానికి ఆయా నగరాల్లో మరణాలకు మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించారు.



## హైడ్రాకు చట్టబద్ధత వెనక ఉంది వాళ్లే...

హైదరాబాద్, అక్టోబర్ 2: హైడ్రాకు చట్టబద్ధతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. హైడ్రాకు చట్టబద్ధత వెనుక కేంద్రం ఉందని మాజీ మంత్రి కామెంట్స్ చేశారు. బీజేపీ పెద్దల సూచనతోనే గవర్నర్ హైడ్రాకు చట్టబద్ధత కల్పించారని అన్నారు. మూసీ బ్యూటీఫికేష్ కాదు.. పక్కా లూటిఫికేషన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. చిన్న పిల్లగాడు పిలిస్తే తెలంగాణకు ఉరికొస్తానన్న రాహుల్ గాంధీ.. ఏడ సచ్చిండు అంటూ ఘాటుగా స్పందించారు. మూసీ రేవంత్ రెడ్డి ప్రాజెక్ట్ కాదు.. రాహుల్ గాంధీ ప్రాజెక్ట్ అని సంచనల వ్యాఖ్యలు చేశారు. పేదలు చనిపోతుంటే.. రాహుల్ గాంధీ ఎక్కడ అని ప్రశ్నించారు. మూసీ మూటలు మాత్రమే రాహుల్ గాంధీకి కావాలన్నారు. రబీ సీజన్ మెదలైనా.. రైతుబంధు ఇప్పటికీ లేదన్నారు. హామీలకు నిధులు లేవు కానీ.. మూసీ ప్రాజెక్ట్ కు నిధులెక్కడవని ప్రశ్నించారు. 16వేల కోట్లతో మెదలైన ప్రాజెక్ట్‌ను లక్షా 50వేలకు పెంచటం వెనుక భారీ కుంభకోణం ఉందని ఆరోపించారు. దమ్ముంటే పరిష్మన్ ఇచ్చిన వారిపై రేవంత్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలను ఆక్రమణదారులు, దొంగలుగా చిత్రీకరించటం సరైంది కాదన్నారు. దొంగచాటుగా సర్వేలు చేయాల్సిన అవసరం ఏంటని నిలదీశారు. మూసీ ప్రాజెక్ట్‌తో రాష్ట్రానికి ఒరిరే లాభం ఏంటని అడిగారు. హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ ఆదాయం పడిపోయిందన్నారు. బిల్డర్ల తరుపున కాదు.. వారి కింద పనిచేసే కార్మికుల పక్షాన మాట్లాడుతున్నామని మాజీ మంత్రి వెల్లడించారు.




## తెలంగాణ కాంగ్రెస్ లో పదవుల జాతర.. ఆ నేతలకు లక్కీ ఛాన్స్!

పదవుల పంపకాలపై కాంగ్రెస్ హైకమాండ్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా అసంతృప్తిగా ఉన్న కీలక నేతలను గుర్తించి వారికి పదవులు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇటీవల పీసీసీ చీఫ్ పదవి ఆశించి భంగపడ్డ మధుయాష్కీ గౌడ్కు జాతీయ జనరల్ సెక్రెటరీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ అగ్ర నాయకత్వం డిసైడ్ అయినట్లు గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరో ముఖ్య సీనియర్ నేత వీహెచ్కు కూడా కీలక పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఆయనకు ఏఐసీసీ ఓ బీసీ ఛైర్మన్ పదవి ఇచ్చే ఛాన్స్ ఉందని సమాచారం. ఈ ఇద్దరికి పదవులు ఇవ్వడం ద్వారా అసలైన కాంగ్రెస్ వాదులకు అన్యాయం జరుగుతోందన్న ప్రచారానికి ఫుల్స్టాప్ పెట్టే యోచనలో కాంగ్రెస్ ఉంది.

**దసరా తర్వాత కేబినెట్ విస్తరణ..** మరో వైపు కేబినెట్ విస్తరణకు సైతం హైకమాండ్ ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. దసరా తర్వాత మంత్రివర్గాన్ని విస్తరించనున్నట్లు సమాచారం.

ఈ లోగా ఇతర నామినేటెడ్, పార్టీ పదవుల భర్తీ పూర్తి చేయాలని రేవంత్ భావిస్తున్నట్లు సమాచారం.

ముదిరాజ్ సమాజిక వర్గం నుంచి వాకిటి శ్రీహరికి ఛాన్స్ ఖాయమన్న చర్చ పార్టీలో జరుగుతోంది. చెన్నూరు నుంచి విజయం సాధించిన వివేక్ వెంకటస్వామికి సైతం మంత్రి పదవి దక్కడం పక్కా అని తెలుస్తోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తదితరులు సైతం మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు.

## బీజేపీ నూతన యాక్షన్ ప్లాన్

హైదరాబాద్: హైడ్రా, మూసీ కూల్చివేతల విషయంలో బీజేపీ కార్యచరణ రేపు(గురువారం) ప్రకటిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మూసీ సుందరీకరణలో భాగంగా నిర్వాసితులయ్యే బాధితులను ఆదుకునేందుకు రేపట్నుంచే తమ పోరాటం ఉంటుందని ఆయన తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇవాళ(బుధవారం) కిషన్ రెడ్డి పర్యటించారు. అంబర్‌పేట్, అసెంబ్లీ, ముసారాంబాగ్, అంబేడ్కర్ నగర్, తులసి నగర్ మీదుగా కృష్ణానగర్ వరకూ బస్తీలను సందర్శించారు. కేంద్రమంత్రి స్వయంగా వెళ్లి నిర్వాసిత కుటుంబాల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ



సందర్భంగా మూసీ నిర్వాసితులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. ఇళ్లు కోల్పోతే రోడ్డున పడే పరిస్థితి వస్తుందంటూ కిషన్ రెడ్డి ఎదుట కన్నీటి పర్యంతం అయ్యారు. సారూ.. మీరే దిక్కంటూ బోరున విలపించారు. ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, తమను ఇక్కడ్నుంచి పంపించవద్దంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో డబ్బులు ఖర్చు చేసి ఇళ్లు కట్టుకున్నామని చెప్పారు. ఇలాంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని అన్నారు. తమను ఆదుకునేందుకు ముందుకు రావాలిని కోరారు. అయితే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధితులను ఓదార్చారు. ఇళ్లు కూల్చే పరిస్థితి వస్తే తానే అడ్డుగా నిలబడి కాపాడతానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దని, మీ అందరికీ బీజేపీ తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు.

## మరో మారు రైతన్నకు అండగా....

# కాంగ్రెస్ సర్కార్





## అన్నదాతకు రేవంత్ సర్కార్ దసరా కానుక..

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నది. అన్నదాతల జీవితాల్లో వెలుగులు నింపేలా కృషి చేస్తుంది. రైతులకు అండగా నిలిచేందుకు వినూత్నమైన పథకాలను ప్రవేశపెడుతున్నది. కర్షకులకు అండగా నిలిచేందుకు రేవంత్ సర్కార్ రెడీ అవుతోంది. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు చర్యలు చేపట్టింది. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన వరిధాన్యానికి రూ.500 బోనస్ అందించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు 15 వేలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. అదేవిధంగా రైతులు ఎంతో కాలంగా ఎదురు చూసిన రైతు రుణమాఫీని కూడా అమలు చేసింది. తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసింది. ఇక ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి మరో తీపికబురును అందించింది తెలంగాణ ప్రభుత్వం. రైతులకు దసరా కానుకగా సీఎం రేవంత్ అదిరిపోయే గిఫ్ట్ ను అందించారు. పామాయిల్ రైతులకు మద్దతు ధరను పెంచుతున్నట్లు ప్రకటించారు. దాదాపు రూ. 3 వేలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రేవంత్ సర్కార్ నిర్ణయంతో

## పామాయిల్ మద్దతు ధర రూ.3 వేలు పెంపు!

పామాయిల్ రైతుల కుటుంబాల్లో దసరా పండగ సంబరాలు ముందుగానే ప్రారంభమయ్యాయి. పామాయిల్ గెలల ధరను రూ.17,043కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన చేశారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని పెంచిందని వెల్లడించారు. సెప్టెంబరు 13న ముడి పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని తుమ్మల వెల్లడించారు. గెలల ధర పెరుగుదలతో పామాయిల్ సాగువైపు మరికొందరు రైతులు మొగ్గుచూపుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం కృషి వల్లనే ఇది సాధ్యమైందన్నారు. దీంతో ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.14,392 నుంచి రూ.17,043కి పెరిగిందని చెప్పారు. అంటే దాదాపు రూ. 3 వేలు అదనంగా రైతులకు అందనున్నాయి. పామాయిల్ సాగు చేసే వేలాది మంది రైతన్నలకు లబ్ధి చేకూరనున్నది.




# ఇద్దరు మిత్రులు

## కేసీఆర్‌కు అనుకోని అదృష్టం.. జగన్‌కు కలిసిరాని కాలం

హైదరాబాద్ / అమరావతి : రాజకీయాల్లో ఎప్పుడు ఎవరిని ఏ రూపకంగా అదృష్టం వరిస్తుందో ఊహించలేం. పదేళ్ల పాటు చతికిల పడిపోయిన కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఎవరైనా ఊహించారా..? అంతే మరి రాజకీయాల్లో ఇలాంటి మిరాకిల్స్ జరుగుతూనే ఉంటాయి. తెలంగాణకు రేవంత్ రెడ్డి సైతం ముఖ్యమంత్రి అవుతారని కూడా బహుషా ఎవరూ ఊహించి ఉండరేమో. కానీ.. అదృష్టవశాత్తూ ఆయన ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. అలాగే.. కొన్ని కొన్ని ఉదంతాలు కూడా ఆయా పార్టీలకు కలిసొస్తుంటాయి. సరిగా ఇప్పుడు బీఆర్ఎస్‌కు అలాంటి అదృష్టమే కలిసొచ్చింది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న పార్టీ గత ఎన్నికల్లో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. దాంతో అప్పటి నుంచి ఆ పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. ఇప్పటికే అధికారం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న పార్టీకి హైడ్రా ఊపిరిపోసింది. హైడ్రా కాస్త బీఆర్ఎస్‌కు అస్త్రంగా దొరికింది. జీవితకాలం కష్టపడి సంపాదించుకున్న ఇళ్లు కళ్లముందే నేలమట్టం అవుతుండడంతో బాధితులు రేవంత్ సర్కార్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. కూల్చివేతలు ఆపాలని, కూల్చివేతలు వద్దని వేడుకున్నారు. అదేసమయంలో బాధితులంతా కలిసి బీఆర్ఎస్ తలుపుతట్టడం ఆ పార్టీకి మరింత కలిసివచ్చింది. దాంతో అందివచ్చిన అవకాశాన్ని అవసరం మేరకు వాడుకోవాలని బీఆర్ఎస్ పార్టీ చూస్తోంది. ఇక.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి వస్తే అక్కడ 40 ఏళ్ల సీనియర్ నాయకుడు చంద్రబాబు ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారు. జగన్ కూడా మొన్నటి వరకు సీఎంగా ఉన్నారు. ఇప్పుడు అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉన్నారు. అయితే.. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు తన పాలనలో ఎక్కడ కూడా వైసీపీకి ఛాన్స్ ఇవ్వడం లేదు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పాలనను నడిపిస్తున్నారు. జగన్ హయాంలో అనాలోచిత నిర్ణయాలతో పాలన గాడిన తప్పిందని భావించిన చంద్రబాబు.. ఇప్పుడు వాటిని సరిదిద్దే పనిలో పడ్డారు. అందులో భాగంగా గతంలో రాష్ట్రం నుంచి తరలిపోయిన కంపెనీలను, పెట్టుబడులను తిరిగి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి రాష్ట్రానికి ఇప్పటికైనా రాజధానిని నిర్మించి చూపించాలనే కసితో ఉన్నారు. ఐదేళ్లుగా నిద్రావస్థలో ఉండిపోయిన వ్యవస్థలన్నింటినీ ఇప్పుడు నిద్ర లేపుతున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా వారికి స్ట్రాంగ్ వార్నింగులు ఇస్తూ వస్తున్నారు. అలాగే.. అమరావతిని చీకట్లోకి నెట్టి మూడు రాజధానుల అంశాన్ని జగన్ తీసుకొచ్చారు. దాంతో ఇప్పుడు మూడు రాజధానుల ప్రస్తావనే తీసుకురాకుండా అమరావతిని రాజధాని అని.. అమరావతికి మరోసారి జీవం పోసే విధంగా చూస్తున్నారు. ఇక ఇప్పట్లో ఆయన మీద అక్కడ వ్యతిరేకత వచ్చే పరిస్థితులైతే ఏం కనిపించడం లేదు. అయితే.. అక్కడ ఉల్టా చంద్రబాబు చేతికే ఓ ఆయుధం దొరికింది. అదే తిరుమల లడ్డూ వివాదం. ఈ వివాదంలో ఇప్పటికే వైసీపీని ఏ స్థాయిలో దిగజార్చాలో ఆ స్థాయికి చేర్చారు. దేశవ్యాప్తంగా ఆ పార్టీపై వ్యతిరేకత వచ్చేలా చేయడంలో సక్సెస్ అయ్యారనే చెప్పాలి. తెలుగు రాష్ట్రాలలో కేసీఆర్, జగన్ ఒకేసారి అధికారం కోల్పోయారు. ఇప్పుడు ఇరు పార్టీలు కూడా ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నాయి. కానీ.. తెలంగాణలో బీఆర్ఎస్‌కు వచ్చిన మైలేజీ ఏపీలో వైసీపీకి దొరక్కపోవడం గమనార్హం.

గరుడ వార్త



# సంపాదకీయం

## కేసుల వలలో సీఎం విలవిల

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సరికొత్త సమస్యలు చుట్టుముట్టేస్తున్నాయి. ముడా భూముల స్కామ్ వ్యవహారంలో తాజాగా ఈడీ కూడా ఎంటరవ్వడంతో ఆయన విలవిల్లాడుతున్నారని అంటున్నారు. రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి ఆయనకు పార్టీలోనూ, బయటా కూడా పోరు మొదలైన పరిస్థితి. దీంతో.. తనకు సొంత పార్టీలోనే శత్రువులున్నారని ఆయన బహిరంగానే వ్యాఖ్యానించారు. ఇలా రాజకీయంగా ఎంత పోటీ ఉన్నా, ఎన్ని సమస్యలున్నా తట్టుకునే సిద్ధరామయ్యకు తాజాగా ముడా భూముల విషయంలో అవినీతి మరక అంటింది. ఈ సమయంలో ఆయన భార్య కీలక నిర్ణయం వెల్లడించారు. అవును... ఇప్పుడు కర్ణాటక రాజకీయాల్లో ముడా భూముల స్కామ్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో.. ఈ కేసులోకి ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఎంట్రీ ఇచ్చింది. దీంతో... సీఎం సిద్ధరామయ్యకు సమస్యలు తప్పవా అనే చర్చ తెరపైకి వచ్చింది. మరో పక్క డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హోంమంత్రి పరమేశ్వర్ తో భేటీ అవ్వడం సంచలనంగా మారింది. ఈ సమయంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతి కీలక ప్రకటన చేశారు. ఇందులో భాగంగా... అవినీతి మరక లేని తన భర్త రాజకీయ జీవితానికి ముప్పు తెస్తున్న 'ముడా'కు చెందిన భూములను తిరిగి అదే సంస్థకు ఇచ్చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా స్పందించిన సీఎం సతీమణి... తన భర్త సీఎం సిద్ధరామయ్య 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతికి పాల్పడకుండా జాగ్రత్తపడ్డారని.. ఆయన రాజకీయ, ప్రజా జీవితానికి ఎటువంటి సమస్యా రాకూడదని తాను ఇంటికే పరిమితమై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాట్లు, ఆయనకు ఉన్న ప్రజాభిమానాన్ని చూసి సంతోషిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ముడాకు సంబంధించిన స్థలాల విషయంలో వచ్చిన ఆరోపణలు విని తాను తీవ్ర ఆవేదనకు లోనైనట్లు తెలిపారు. తమ అన్నయ్య పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఈస్థలాలు ఇంత రాధాంతం చేస్తాయని ఊహించలేదని అన్నారు. ఈ సమయంలోనే... తన భర్త గౌరవం, ఘనతకు మించి ఈ ఆస్తులు పెద్దవి కాదని ఆమె స్పష్టం చేశారు. అందుకే ఈ స్థలాలను తిరిగి ముడాకు అప్పగిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ విషయంలో తన భర్త అభిప్రాయం ఏమిటో తనకు తెలియదని.. కుటుంబ సభ్యులతో చర్చించకుండా తనను తాను తీసుకున్న నిర్ణయం ఇదని ఆమె అన్నారు. అవసరమైతే దర్యాప్తుకు సహకరిస్తామని తెలిపారు. మరి ఇప్పుడు ఈ వ్యవహారం ఎలా మారుతుందనేది చూడాలి!

# పట్టణ, పల్లెల్లో ఘనంగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు...

### అలియాబాద్ గ్రామంలో 60 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మహాత్ముని విగ్రహం వద్ద గాంధీ జయంతి వేడుకలు....



శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో మహాత్మా గాంధీ 155 వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అలియాబాద్ గ్రామంలోని జనార్దన్ నగర్ కాలనీలో 60 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి అలియాబాద్ గ్రామ పెద్దలు, కాలనీవాసులు మహాత్ముని జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. 60 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన నాటి నుండి నిరంతరాయంగా గాంధీ జయంతి వేడుకలు జరుపుకుంటున్నడం విశేషంగా చెప్పుకుంటారు.

బుధవారం తుంకుంట మున్సిపల్, శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలంలోని గ్రామాలలో గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తూముకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయంజాల్ లో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, కమిషనర్ వెంకట గోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుంకుంట మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాజేశ్వరరావు, కమిషనర్ వెంకట గోపాలు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

శామీర్ పేటలో గాంధీ విగ్రహానికి గ్రామ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించగా వార్డు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి మండలంలోని గ్రామాలలో గాంధీ విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న శామీర్పేట సిఐ

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను నిర్వహించగలం..ఇన్స్పెక్టర్ శ్రీనాథ్...



శామీర్ పేట, (గరుడ వార్త) : మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకల్లో శామీర్ పేట సిఐ శ్రీనాథ్ పాల్గొని మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను తగ్గించగలమని శామీర్ పేట సీఐ శ్రీనాథ్ సూచించారు. బుధవారం మూడు చింతలపల్లి మండలం జగ్గం గుడాలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 పోలీసులతో సమానమని, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలు, ఘోరాలు తగ్గుతాయని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాలు చేయడానికి జంక్ తారని చెప్పారు. ఎలాంటి నేరమైన సీసీ కెమెరాలతో సహాయంతో సునాయసంఘ చేదించవచ్చని చెప్పారు. సిసి కెమెరాలు ఉంటే ఈ మధ్యలో జరిగిన చోరీని రెండు రోజుల్లోనే సేదించే వాళ్ళమని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సిసి కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని సూచించారు. ఇటీవల గ్రామంలో జరిగిన దొంగల దోపిడికి గురైన చెవ్వ రాములమ్మ కేసును కేవలం నాలుగు రోజులనే చేదించినందుకు ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, డి ఐ గంగాధర్, ఎస్సై పరశు రాములను సన్మానించారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ వార్డ్ సభ్యులు నాగరాజు, భూపాల్ రెడ్డి, అనిల్ రెడ్డి, విష్ణురెడ్డి, సుమలత, సాయిబాబు, ధర్మ రెడ్డి, బాల్ రెడ్డి, దిలీప్ కుమార్, నాగరాజు, కృష్ణ రెడ్డి, కృష్ణ, మహంకాళి, గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇంటింటా బతుకమ్మ సంబరాలు



**శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో ఘనంగా బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. బుధవారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని తూముకుంట మున్సిపల్, శామీర్ పేట మండలం, మూడుచింతలపల్లి మండలంలోని గ్రామాలలో బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ అంటూ వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మలను ఏర్పాటు చేసుకొని ఆయా గ్రామాలలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసి మహిళలు, యువతులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా బతుక మ్మ పాటలు పాడుతూ ఆటలాడారు. ఆటపాటలతో ఉత్సాహంగా జరుపు కున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులలో, కుంటల లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.**

# ఇక్కడా ఉక్కుపాదం మోపాలి..!

మహబూబ్‌నగర్ : పెద్ద చెరువు రికార్డుల్లో మొత్తం 96.11 ఎకరాల్లో ఉంది. ప్రస్తుతం ఈ చెరువు 56 ఎకరాలకు కుచించుకుపోయింది. మిగతా 40 ఎకరాలు ఆక్రమణలకు గురైంది. ఈ ఆక్రమణలపై గతంలో పురపాలిక, సాగునీరు, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఎఫ్‌టీఎల్ పరిధిలో మొత్తం 64 ఆక్రమణలున్నట్లు గుర్తించారు. గుర్తుగా మొత్తం 35 దిమ్మెలను భవనాల వద్ద ఏర్పాటు చేశారు. బఫర్ జోన్‌లోనూ మరో 70కు పైగా ఇళ్లు అక్రమంగా నిర్మించారు. రాజకీయ పలుకుబడితో ఈ ఆక్రమణలపై అధికారులు కన్నెత్తి చూడటం లేదు.
గ్రేటర్ హైదరాబాద్‌లో చెరువులు, కుంటల ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా అక్రమాలపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చేస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్లు, నేతల నుంచి పైరవీలు వస్తున్నా లొంగకుండా చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తోంది. హైడ్రా కేవలం అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) లోపలి వరకే పరిమితమైంది. ఉమ్మడి జిల్లాలో హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలోని చెరువుల్లోనూ ఆక్రమణల భరతం పట్టొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయి. శిఖంలోనూ నిర్మాణాలు జరిగాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిల్లోనూ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఇవన్నీ స్థానిక అధికారుల నోటీసులో ఉన్నా



రాజకీయ ఒత్తిళ్లతో కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

**రాజకీయ పలుకుబడితో...**

పాలమూరులో 5,161 చెరువులు, 1,257 కుంటలున్నాయి. మొత్తం 6,418 చెరువులు నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఉన్నాయి. వీటిలో పలు చెరువులు, కుంటలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం, జడ్చర్ల, దేవరకద్రల్లో చెరువులు, కుంటలు కుంచించుకుపోయాయి. నాగర్‌కర్నూల్ పట్టణంలో కేసరి సముద్రం చెరువు ఆక్రమణలకు గురయ్యింది. వీటి ఎఫ్‌టీఎల్ పరిధిలో పలు నిర్మాణాలు వెలిశాయి. జిల్లాలో నాగనూల్ చెరువుతోపాటు మరో మూడు కుంటలు కుంచించుకుపోయాయి. అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల్లోనూ కొన్ని చెరువుల్లో ఆక్రమణలు జరిగాయి. వనపర్తి జిల్లాలో మర్రికుంట, తాళ్లచెరువు, నల్లచెరువులో ఆక్రమణలు భారీగా చోటు చేసుకున్నాయి. వీటి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు వెలిశాయి. నారాయణపేట జిల్లాలోని మక్తల్, మరికల్ పట్టణాల్లో చెరువులో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడి చెరువుల్లో నిర్మాణాలు సైతం వెలిశాయి. జోగులాంబ గద్వాల జిల్లా సిద్దాంతికుంట, తిరుమలయ్యకుంట, జీవికుంట చెరువులు రూపురేఖలు మారాయి. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. నీటివనరుల ఆక్రమణలో రాజకీయ నేతల పాత్ర ఎక్కువగానే ఉంది. హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేసి ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తేనే వీటికి పూర్వవైభవం వచ్చే అవకాశం ఉంది. లేకుంటే ఈ ఆక్రమణలు రోజురోజుకు పెరిగే అవకాశాలున్నాయి.

# భారత్‌మాల వంతెన.. అవస్థలకు అంతుండేనా!

అయిజ : పాలకులు ప్రజలు, ముఖ్యంగా రైతుల ఇబ్బందిని గమనించి నిర్ణయాలు తీసుకోవాలి. భారత్‌మాల వంతెన నిర్మాణాల వల్ల రాబోవు రోజుల్లో రైతులు అవస్థలు పడాల్సి వస్తుందనేది స్పష్టంగా కనిపిస్తున్నా దానిపైన పాలకులు దృష్టి పెట్టడంలేదు. దీని వల్ల ఎదురయ్యే ఇబ్బందులు అన్నీఇన్నీ కావని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన సమస్య: కొన్ని ప్రదేశాలలో భారత్‌మాల రోడ్డు పనుల వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇప్పటికే రోడ్డుకిరువైపులా భూములు మిగిలిపోవడం రైతులకు శాపంగా మారుతోంది. దీనికితోడు కాలువలపైన భారత్‌మాల రోడ్డు కోసం చిన్నచిన్న వంతెనలు నిర్మిస్తున్నారు. దీన్ని కాలువ వరకే పరిమితం చేస్తున్నారు. కాలువ పక్కన రైతుల అవసరాల కోసం రోడ్డు ఉన్న విషయం భారత్‌మాల అధికారులు విస్మరించారు. ఈ తప్పిదం వల్ల రాబోవు రోజుల్లో ప్రజలు, ప్రధానంగా రైతులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. పంట ఉత్పత్తులు మరోవైపునకు తరలించాలంటే 5 నుంచి 10 కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. రెండు వందల అడుగుల వెడల్పు రోడ్డు దాటితే సరిపోయే పరిస్థితికి కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి రావడమంటే అన్నదాతకు ఎంత శ్రమో అర్థం చేసుకోవచ్చు. కొన్ని ప్రదేశాలలో కాలువపైన వెడల్పుగా, రోడ్డుకు తక్కువ వెడల్పుగా వంతెనలు నిర్మిస్తున్నారు.
పై వంతెన నిర్మించాల్సి ఉనా..: భారత్‌మాల రోడ్డు పనులు ఆర్డీఎస్ ప్రధానకాల్వపైన తనగల, కొంకల మధ్య జరుగుతున్నాయి. దీని నిర్మాణం పైన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాలువ కట్ట ఎత్తు ఎంత ఉంటే దానిపైన బ్రిడ్జి నిర్మించేస్తున్నారు. వాస్తవానికి కాలువ, దాని ఇరుపక్కలా కాలువ కట్టలకు కలిపి పై వంతెన నిర్మించాల్సి ఉంది. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నుంచి వచ్చే నీటిని నిల్వ చేసుకునేందుకు రిజర్వాయర్ల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. రిజర్వాయర్ల ఏర్పాటు తర్వాత కాలువ ఎత్తు పెంచాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితులలో ప్రస్తుతం కాలువ కట్టస్థాయిలో బ్రిడ్జి నిర్మాణం ఇబ్బందికరంగా మారుతుంది. రాబోవు రోజుల్లో కాలువ ఎత్తు, వెడల్పు చేయాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. దీనికితోడు కాలువకు ఇరుపైపులా 20 అడుగుల వెడల్పుతో కట్టలున్నాయి. బ్రిడ్జిని కాలువ కట్టల ఎత్తులో మాత్రమే నిర్మిస్తున్నారు. ఆ కట్టలపై ఇక వాహనాలు వెళ్లే అవకాశం ఉండదు. ఒకవేళ వెళ్లాలంటే కాలువ కట్టలు 50 నుంచి 60 మీటర్ల మేర తొలగించాల్సి ఉంటుంది. అసలే అంతంత మాత్రంగా ఉన్న కాలువ కట్టలు ఈ రకంగా 50 మీటర్ల మేర తొలగిస్తే బలహీనపడతాయి. ఈ ప్రదేశంలో 50 మీటర్ల మేర కాంక్రీట్ వాల్స్ నిర్మించాల్సి ఉంది. కానీ 5 మీటర్ల మేర మాత్రమే కాంక్రీట్ పనులు చేశారు. ఇప్పటివరకు కాలువ కట్టలపైన రైతులు ధాన్యం, చెరకు, సుబాబుల్, మిరప, పత్తి వంటి పంటలను ట్రాక్టర్, లారీలలో తరలించేవారు. ఈ వంతెనలు పూర్తయితే అది సాధ్యం కాదు.
చర్యలు తీసుకుంటాం–విజయ్‌కుమార్‌రెడ్డి, ఈఈ, ఆర్డీఎస్
కాలువలపైన ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జిల విషయంలో పరిశీలిస్తున్నాం. పూర్తిస్థాయిలో పనులు జరగాల్సి ఉంది. కాలువ కట్టలను కొంతమేర తొలగించాల్సి ఉంటుంది. వాటిపైన భారత్‌మాల అధికారులతో మాట్లాడుతున్నాం. రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం.

## బాల్యం.. పుస్తకానికి దూరం

నాంపల్లి : పుస్తకమనేది అక్షరాలతో పాటు మానవ సంబంధాలను తనలో అందంగా దాచుకున్న తరగ(తి)ని గని. పదాలతో పలకరిస్తూ.. ప్రపంచాన్ని మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. కథలు..కామిక్‌లు.. ఇలా దేనిపై చిన్నారికి ఆసక్తి ఉంటే తల్లిదండ్రులు దానికి సంబంధించి ఓ పుస్తకాన్ని వారి ముందు ఉంచండి. మనిషి తన జీవన గమనాన్ని మార్చుకోవడానికి పుస్తకానికి మించిన సాధనం మరొకటి లేదని వారికి అర్థమయ్యేలా వివరించండి. ఆధునిక సమాజంలో నేటి తరాన్ని పుస్తక పఠనానికి దగ్గర చేయండి. అదే సమాజానికి మీరిచ్చే విలువైన కానుక.

మానవ మస్తిష్కాలను రగిలించి శక్తిమంతులను చేసేది పుస్తకం.. అలాంటి పుస్తకం రోజుకో కొత్త యాప్స్‌తో పుట్టుకొస్తున్న చరవాణి ప్రపంచంలో మనిషికి దూరమవుతోంది. భావిపౌరులైన నేటి బాల్యం పొరపాటుగానైనా పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవడంలేదని మేధావులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు, గురువులు పుస్తకాల విలువను నేటి తరానికి తెలియజెప్పాలి. ఆ



అలవాటును వారి దరికి చేర్చాలి. నేటి చిన్నారులు ఆధునిక అలవాట్లతో బంధీలవుతున్నారు.

కారణాలు ఇవీ.. తల్లిదండ్రులు పుస్తకాలు చదివేలా ప్రోత్సహించకపోవడం. చరవాణి, కంప్యూటర్ ఆటలు, సినిమాలు, సామాజిక మాధ్యమాలకు అలవాటు పడటం.

సరైన పుస్తకాన్ని పిల్లలు ఎంపిక చేసుకోకపోవడం. చదవడంలో పిల్లలకున్న ఇబ్బందులు తల్లిదండ్రులు గుర్తించకపోవడం.

ఆటలపైనే అమితాసక్తి ఉండటం. ఒక చోట నిశ్చింతగా కూర్చో లేకపోవడం.

బహుమతిగా ఇవ్వాలి..

పిల్లలకు చిన్ననాటి నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలి. ఏదైనా సందర్భం వస్తే పుస్తకాలు బహుమతిగా ఇచ్చి పఠనంపై దృష్టి మరల్చేలా చూడాలి. చందమామా, బాలమిత్ర, బొమ్మరిల్లు లాంటి కథల పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. వాటిలోని నీతిని వారికి వివరించాలి. అప్పుడప్పుడు గ్రంథాలయాలకు తీసుకెళ్లి పాఠకుల ఆసక్తిని గమనింపజేయాలి. మంచి పుస్తకాల గురించి పిల్లలతో విస్తృతంగా చర్చించాలి. ఇంటి ప్రధాన హాల్లో, పిల్లల గదిలో పుస్తకాలు ఉండేలా చూడాలి. పుట్టిన రోజు నాడు ఓ మంచి పుస్తకం ఇవ్వాలి. ఇంటిలో ఓ చిన్నపాటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి.

## సర్దుబాటుకు కసరత్తు

భువనగిరి : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు విద్యాశాఖ గతంలో చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ సత్ఫలితాలను ఇవ్వలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా, ఉపాధ్యాయుల అవసరాలను బట్టి మళ్లీ చేపట్టనున్న సర్దుబాటు ప్రక్రియ ఉపాధ్యాయ సంఘాలు ప్రస్తుతం వ్యతిరేకిస్తున్నాయి. తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరదని, నియామక ప్రక్రియ వేగవంతం చేసి విద్యాప్రమాణాలు పెంచాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మారుమూల ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగా..

నాడు అవసరం ఉన్న పోస్టులను చూపించి, కొన్ని పోస్టులను బ్లాక్ చేసిన పక్షంలో మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలోని పోస్టులు భర్తీ అయ్యేవని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. దీంతో నేటికి జిల్లాలోని మారుమూల మండలాలు అయిన గుండాల, అడ్డగూడూరు, రాజపేట మండలాల్లోని పాఠశాలల్లో అత్యధిక పోస్టులు ఖాళీగా మిగిలాయి. దీనికి తోడు ప్రాథమిక పాఠశాలల్లోని అర్హులైన ఎస్జీటీలు పదోన్నతులు పొందారు, బదిలీ అయ్యారు. వీరి స్థానంలో డీఎస్సీ ద్వారా నూతన ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంది.

సర్దుబాటు ఇలా...జిల్లా వ్యాప్తంగా జులై నెలలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. 110 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా 70 మంది విధుల్లో చేరారు. జిల్లా వ్యాప్తంగా 712 పాఠశాలలు పనిచేస్తున్నాయి. ఇందులో 38,277 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కలెక్టర్ అనుమతితో మళ్లీ సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసేందుకు విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. మండల విద్యాధికారులతో




ఎక్కడ ఉపాధ్యాయులు అవసరం ఉన్నారో నివేదికలు తెప్పించుకుంటున్నారు.

పాఠశాలల్లో పరిస్థితులు...జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు, మరి కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు అధికంగా ఉన్నారు. ఇటీవల చేపట్టిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా అర్హులైన ఉపాధ్యాయులు తమకు అనుకూలంగా ఉన్న మండలాల్లోని పాఠశాలను ఎంపిక చేసుకుని ఉద్యోగాల్లో చేరారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా ఖాళీగా ఉన్న పోస్టులు అన్ని చూపించడంతో కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులు తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం– కందుల సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నాం. సర్దుబాటు చేయాల్సిన ఉపాధ్యాయుల పోస్టుల వివరాలను మండల విద్యాధికారుల ద్వార నివేదిక తెప్పించుకుంటున్నాం. వివరాల సేకరణ పూర్తయిన వెంటనే ఎక్కడ ఏ ఉపాధ్యాయుడు అవసరం అవుతారో వారిని అక్కడ సర్దుబాటు చేస్తాం.

# దృష్టి సారిస్తున్నారా!



పెద్దపల్లి : బుజ్జాయి అన్నం తిననని మారాం చేస్తే అమ్మకు గుర్తొచ్చే సాధనం ఫోన్.. అబ్బాయి అల్లరి చేస్తుంటే టీవీ పెట్టేస్తాడు నాన్న.. ఆ తర్వాత పిల్లలు బడి నుంచి రాగానే పుస్తకాలు పక్కన పడేసి ఫోన్లలో మునిగిపోతుంటారు.. హెూంవర్క్ చేసుకోకుండా టీవీ చూస్తూ గడుపుతుంటారు.. పిల్లలను బుజ్జగించడానికి తల్లిదండ్రులు చేస్తున్న అలవాటు మున్ముందు వారికి ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.. భావి పౌరుల్లో కంటి సమస్యలు పెరుగుతున్నట్లు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ్(ఆర్బీఎస్కే) నివేదికలు వెల్లడిస్తున్నాయి. పాఠశాలల విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని గుర్తించిన ప్రభుత్వం కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేలోగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు జరపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో బడుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థినీ పరీక్షించి కంటి సంబంధిత సమస్యలున్నాయా? దృష్టి లోపంతో బాధ పడుతున్నారా? శస్త్రచికిత్స అవసరం ఉందా? అని ఆప్తమాలజీ ఇన్‌స్ట్రక్టర్లు నిర్ధారిస్తున్నారు. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 23 మంది భాగస్వాములతున్నారు. మొత్తం 1,14,479 మంది విద్యార్థులకు గాను ఇప్పటివరకు 46,954 మందిని పరీక్షించారు. వీరిలో 2,527 మందికి అద్దాలు అవసరమని గుర్తించగా, 141 మందిని శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు.

తల్లిదండ్రులు గమనిస్తుండాలి

ఎక్కువసేపు టీవీలు, స్మార్టుఫోన్లు, కంప్యూటర్లను చూస్తే కళ్లు పొడిబారి దృష్టి సమస్య వస్తుంది.

పిల్లలు ఖాళీ సమయంలో టీవీలకు, ఫోన్లకు అతుక్కుపోకుండా ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించాలి.

చదివే సమయంలో పుస్తకాలను దగ్గరగా పెట్టుకోకుండా కంటికి కనీసం 30 సెం.మీ.ల దూరంలో ఉండేలా చూడాలి.

మూడు, ఆరేళ్లలో పరీక్షలు

బాల్యంలోనే కంటి సమస్యలను గుర్తిస్తే భవిష్యత్తులో ఇబ్బందులుండవు. మూడేళ్ల వయసులో కంటి వైద్య పరీక్ష చేస్తే బొమ్మలను గుర్తు పడుతున్నారా? అనేది తేలుతుంది. తిరిగి ఆరేళ్ల వయసులో పరీక్షించాలి. దృష్టి లోపం ఉంటే అద్దాలు, ఇతర సంరక్షణ చర్యలు తీసుకోవాలి.

ఎందుకీ పరిస్థితి!

కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడంతో పిల్లలు ఎక్కువ సమయం తెరలకు అంటుకుపోయి కంటి చూపుపై ప్రభావం పడింది. ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఆన్‌లైన్ హెూంవర్క్ ఇస్తుండటంతో ఫోన్ వాడకం పెరిగింది. ఇటీవలి కాలంలో పిల్లలు ఎక్కువ సేపు టీవీలు, ఫోన్లకు అతుక్కుపోతున్నారు.

తరగతి గదుల్లో నల్లబల్లపై అక్షరాలు, పుస్తకాల్లో చిన్న అక్షరాలు కనిపించం లేదు.

పౌష్టికాహారం, జన్యు లోపాలతోనూ కొందరిలో కంటి చూపు సమస్య తలెత్తుతోంది.

పెరుగుతున్న మానసిక సమస్యలు

విద్యార్థులు ఎక్కువ సమయం ఫోన్లు వాడుతుండటంతో దృష్టి లోపంతో పాటు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒత్తిడికి గురై ప్రతి చిన్న విషయానికీ చిరాకు పడుతున్నారు. ఆకలి మందగించడంతో పాటు ఏకాగ్రత, ఆలోచనా శక్తి కోల్పోతున్నారు. బరువు పెరగడంతో పాటు ఎదుగుదల క్షీణిస్తోంది. తలనొప్పితో బాధ పడుతున్నారు. అయిదేళ్లలోపు పిల్లలకు ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఇస్తుండటంతో కంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

అక్షరాలు చిన్నగా కనిపిస్తున్నాయి

– లలిత, 9వ తరగతి, పెద్దపల్లి జడ్పీ బాలుర పాఠశాల

పుస్తకాలు, బోర్డుపై అక్షరాలు చిన్నగా కనిపిస్తున్నాయి. మా పాఠశాలలో కంటి పరీక్ష చేసుకున్నా. కొద్దిగా సమస్య ఉన్నట్లు తేలింది. అద్దాలు అవసరమని చెప్పారు.

ప్రతి విద్యార్థినీ పరీక్షిస్తున్నాం

– డా.కిరణ్, ఆర్బీఎస్కే, పెద్దపల్లి జిల్లా నోడల్ అధికారి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. దృష్టి లోపాలను గుర్తిస్తూ, అద్దాల పంపిణీకి నివేదిస్తున్నాం. సమస్య అధికంగా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్స చేస్తాం.

స్వీయ రక్షణే ప్రధానం

– డా.వేణుమాధవ్, ఆప్తమాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, రామగుండం వైద్య కళాశాల

పిల్లలు ఎక్కువ సమయం సెల్‌ఫోన్, కంప్యూటరు, టీవీ చూస్తే చూపు మందగిస్తుంది. తదేకంగా చూస్తూ ఉంటే కళ్లలో తడి ఆరిపోతుంది. నిరంతరాయంగా మూడు గంటల కంటే ఎక్కువ సేపు చూడొద్దు. కళ్లకు సంబంధించి వ్యాయామం అలవాటు చేసుకుంటే కొంతవరకు సమస్య రాకుండా చూసుకోవచ్చు. ఏ విటమిన్ కలిగిన ఆకుకూరలు, క్యారట్, కోడిగుడ్డు తరచూ ఇస్తుండాలి.

# అక్రమాల గుట్టు తేలేనా?



పెద్దపల్లి : ప్రవాహానికి అడ్డుకట్ట వేసి భూగర్భ జలాలు పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.. నాసిరకం పనులతో ఆనకట్టలు తెగి నీళ్లతో పాటే నిధులూ కొట్టుకుపోతున్నాయి.. అనుభవం లేని గుత్తేదారులకు పనులు అప్పగిస్తున్న అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు మరవడంతో కలకాలం ఉండాల్సిన నిర్మాణాలు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలనకు సిద్ధమవుతుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది..

రాష్ట్రంలో చెక్‌డ్యాం నిర్మాణాల ప్రగతి, వెచ్చించిన నిధులపై ఇటీవల హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. నిర్మాణాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ జరపాలని ఆదేశాలిచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా మానేరు, హుస్సేన్‌మియా వాగులపై నాలుగేళ్ల కిందట రూ.వందల కోట్లు వెచ్చించిన చేపట్టిన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పనులు జరుగుతుండగానే వచ్చిన వరదలకు చాలా చోట్ల నామరూపాల్లేకుండా కొట్టుకుపోయాయి. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.50 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు వెచ్చించారు. నాణ్యత, పర్యవేక్షణ లోపాలు వెలుగు చూస్తున్నా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఎల్లడెలా నిర్మాణ లోపాలు

ఆనకట్టల నిర్మాణంలో భాగంగా ముందుగా వాగులో గట్టిదనం వచ్చేవరకు ఇసుకను తోడి బెడ్ నిర్మించాలి. ఇందుకు భిన్నంగా ఇసుకపైనే నిర్మించడంతో ఆప్రాన్‌లు, రిటైనింగ్ వాల్స్, అబార్డ్‌మెంట్ భాగాలు వరద ఉద్ధృతికి దెబ్బతింటున్నాయి.

వరద ప్రవాహాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక సాంకేతికత అందుబాటులో లేకపోగా ఇసుక మేటలు పూర్తిగా తొలగించకుండానే ఆనకట్టలు నిర్మించడంతో దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ అనుభవం లేని గుత్తేదార్లకు ఒకటి కంటే ఎక్కువ నిర్మాణాలు కట్టబెట్టడంతో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.

రెండు విడతల్లో 72 చెక్‌డ్యాంలు

2019–20లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 114 నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. రెండు విడతల్లో 72 చెక్‌డ్యాంలు మంజూరు చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోని 52 ఆనకట్టలకు రూ.237.95 కోట్లు చెల్లించారు. జగిత్యాలలో రూ.20 కోట్ల అంచనాతో జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో అయిదు చెక్‌డ్యాం పనులు మాత్రమే ప్రారంభం కాగా అవి కూడా అసంపూర్తిగా ఉన్నాయి.

ముంచిన వరదతో రూ.30 లక్షల నష్టం

మంథని మండలం అడవిసోమన్‌పల్లి వద్ద మానేరులో రూ.16 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం గతేడాది భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. రిటైనింగ్‌వాల్స్ దెబ్బతిని పరీవాహక పొలాలు నీట మునిగాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 23 ప్రధాన చెరువులతో పాటు మోరంచ, చలి, పెద్దవాగుల నుంచి భారీగా వరద చేరడంతో ఈ ఆనకట్ట దెబ్బతింది. దిగువ మానేరు జలాశయం గేట్లు ఎత్తి నీటిని వదలడంతో ఉద్ధృతి మరింత పెరిగింది. ఆనకట్టకు రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. 2023 జులై 27న వచ్చిన వరదకు చిన్నఓదాల వద్ద నిర్మించిన చెక్‌డ్యాం మధ్యలో గండి పడింది.

అసలే ఆలస్యం.. ఆపై అర్ధంతరం

సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలో రూ.4 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం పనులు పునాది దశలోనే ఉన్నాయి. ఏడాది ఆలస్యంగా పనులు ప్రారంభించిన గుత్తేదారు సిమెంటు, కాంక్రీటు ధరలు పెరగడంతో మధ్యలోనే వదిలేశారు.

2016లో జమ్మికుంట మండలం విలాసాగర్ వద్ద మానేరులో రూ.10 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. 800 మీటర్ల పొడవున్న నిర్మాణంలో దాదాపు 120 మీటర్ల మేర కూలింది. మరమ్మతులకు రూ.4 కోట్ల వరకు అవుతాయని అంచనా వేశారు. వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి, ఓదెల మండలం కనగర్తి గ్రామాల మధ్య చెక్‌డ్యాం కట్టకు గండి పడింది. తాత్కాలికంగా మరమ్మతు చేసి లీకేజీలను అరికట్టారు. ఓదెల మండలం రూపునారాయణపేట, కనగర్తి చెక్‌డ్యాంలకు గతంలో వరదతో నష్టాలు సంభవించాయి. వేములవాడ మండలం మల్లారంలో మూలవాగుపై రూ.4.17 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. 80 శాతం పనులు పూర్తి కాగా గుత్తేదారుకు రూ.3.18 కోట్ల వరకు చెల్లించారు. ఇటీవలి వర్షాలకు కట్ట మీదుగా వరద పారడంతో సమీప ఇళ్లకు ముంపు ముప్పు పొంచి ఉందని డిటోనేటర్లతో పేల్చివేశారు.

# అడుగు పెట్టలేదు.. పాలు పొంగలేదు..


సికింద్రాబాద్ : ప్రభుత్వమే సొంతింటి కల నేరవేస్తుందంటే సంబరపడ్డారు.. ఏకంగా రెండు పడక గదుల ఇల్లు అనేసరికి ఆశ్చర్యపోయారు.. చకచక పనులు పూర్తవుతుంటే మురిసిపోయారు. కానీ వారి ఆశ నేరవేరడానికి ఏళ్లుగా ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇదీ మెట్టుగూడ డివిజన్ పరిధి చిలకలగూడ చింతబావిలోని రెండు పడకల ఇళ్ల సముదాయం పరిస్థితి. అర్హులైన పేదవర్గాలకు రెండు పడక గదుల ఇళ్లను నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. నియోజకవర్గంలోని నాలుగు ప్రాంతాలను గుర్తించగా అందులో మెట్టుగూడ డివిజన్‌లోని చింతబావి, సీతాఫల్‌మండి డివిజన్‌లోని సుభాష్ చంద్రబోస్‌నగర్‌లలో నిర్మాణాలు ప్రారంభించారు. ఈ పథకం వచ్చిన కొత్తలోనే పెద్దఎత్తున ఇళు కట్టి పేదలకు ఇవ్వాలని భావించినా.. అనువైన స్థలాలు లేకపోవడంతో అడుగులు ముందుకు పడలేదు. అందుబాటులోని స్థలాల్లో స్థానికుల వరకే నిర్మించాలని నిర్ణయించారు. మొట్టమొదట మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ చింతబావిలో స్థానిక రజక సంఘానికి చెందిన దోబీఘాట్ స్థలాన్ని గుర్తించారు. సెల్లార్ ప్రాంతంలో అధునాతన పద్ధతిలో దోబీఘాట్‌ను నిర్మించడంతోపాటు తొమ్మిది అంతస్తుల్లో ఇళ్లను నిర్మించి 200 మందికి అవకాశం కల్పించాలని 2014లో నిర్మాణానికి పూనుకున్నారు.

మూడేళ్లైనా పంచలేదు.. రెండు పడక గదుల ఇళ్లను పెద్దసంఖ్యలోనే నిర్మించాలని అప్పటి ఉపసభాపతి, స్థానిక ఎమ్మెల్యే టి.పద్మారావు భావించారు. కనీసం 10 వేల మందికి ఇళ్లను కట్టించాలని, ఇందుకోసం నియోజకవర్గ పరిధిలోనే ఉన్న రైల్వే స్థలాల కోసం దిల్లీ స్థాయిలో ప్రయత్నాలు నెరిపారు. లాలాపేట, ఇసుకబావి ప్రాంతంలో 10 ఎకరాలకుపైగా స్థలాన్ని గుర్తించి దాన్ని తీసుకుని బదులుగా చర్లపల్లి వద్దనున్న ప్రభుత్వ స్థలాన్ని ఇచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ విషయంలో జాప్యం జరుగుతుండటంతో చిలకలగూడలోని చింతబావి దోబీఘాట్ వద్ద సుమారు ఎకరం స్థలం ఉండటంతో జీప్లస్ 9 అంతస్తుల నిర్మాణాలు మొదలుపెట్టారు. సీతాఫల్‌మండి సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో జీప్లస్ 5 అంతస్తుల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు 2021 నాటికి పూర్తయ్యాయి.

2021జులైలో సీతాఫల్‌మండిలోని సుభాష్‌నగర్‌లో నిర్మించిన ఇళ్లను 2021 జులైలో దశలవారీగా లబ్ధిదారులకు అందించారు. చింతబావిలో నిర్మించిన ఇళ్లను ఇచ్చే క్రమంలో అధికారులు సర్వే చేయగా.. అందులో కొందరికి పక్కా ఇళున్నాయని, ఇంకొందరి వివరాలు సరిగా లేకపోవడంతో పంపిణీ ఆపేశారు. అర్హుల జాబితాతో పాటు మరికొందరివి కలిపి 207 మంది పేర్లు నమోదైనా ఇప్పటివరకు తాళాలు అప్పగించలేదు.

## కళ్లుకప్పి.. సరిహద్దు దాటించి

భువనగిరి : ఇటీవల భువనగిరి శివారులోని నల్గొండ పైవంతెన వద్ద రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. పౌరసఫరాల సంస్థ సాంకేతిక సహాయకుడు తనిఖీ చేసి లారీలోని బస్తాల్లో పీడీఎస్ బియ్యంలో కలిపే ఎఫ్ఆర్‌కే రైస్ ఉందని గుర్తించారు. అవి పీడీఎస్ బియ్యంగా తేల్చారు. విద్యాసంస్థలు హాస్టల్‌కు సరఫరా చేసే సన్న బియ్యంగా తేలడంతో ఆ లారీని సీజ్ చేశారు. 30 కిలోల చొప్పున 1100 బస్తాల్లో తరలిస్తున్నారు. అందులో 350 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. ప్రస్తుతం ఆ బియ్యాన్ని భువనగిరిలోని పౌరసరఫరాల సంస్థ గోదాములో భద్రపరిచి, లారీని పోలీసులకు అప్పగించారు. 6ఏ కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి డీసీఎస్‌వో వనజాత కు తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. నిఘా విభాగం కళ్లుకప్పి అక్రమార్కులు లారీల కొద్దీ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు దొడ్డు బియ్యాన్ని మాత్రమే అక్రమంగా కొని రీసైక్లింగ్ చేస్తున్న వ్యాపారులు.. ఇప్పుడు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాలకు



సరఫరా చేసే సన్న బియ్యాన్నీ వదలడం లేదు. ఇటీవల భువనగిరి శివారులో అధికారుల తనిఖీల్లో రెండు లారీల లోడ్లు పట్టుబడగా ఒక లారీలో పాఠశాలలు, వసతిగృహాలకు సరఫరా చేసే సన్న బియ్యం ఉండటం గమనార్హం.

లోపాలను ఆసరాగా చేసుకొని..

మార్కెట్‌లో సన్నబియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వాటిపై అక్రమార్కుల దృష్టి పడింది. కొందరు రైస్ మిల్లర్లు, అధికారులతో కుమ్మక్కై విద్యార్థులకు అందించే సన్న బియ్యాన్ని దారి మళ్లిస్తున్నారు. వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు ఎవరికి అనుమానం రాకుండా రేషన్ బియ్యాన్ని పొరుగు రాష్ట్రాలకు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా సన్న బియ్యానికి రూ.5 వేల నుంచి రూ.6,500 వరకు ధర పలుకుతోంది. పీడీఎస్ బియ్యాన్ని సేకరించి ఎవరూ గుర్తించకుండా బ్రాండ్ పేరుతో కూడిన బస్తాల్లో నింపి సాధారణ బియ్యంలా లారీల్లో తరలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రాజపేట, వలిగొండ, బొమ్మలరామారం, ఆలేరు, తుర్కపల్లి మండలాల్లో అక్రమ రవాణా చేస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. సూర్యాపేట, నల్గొండ జిల్లాలో కూడా ఎక్కడ పడితే అక్కడ పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ఒక్క యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ఈ ఏడాది 83 కేసులు నమోదయ్యాయి. అధికారులు నిఘా పెంచి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బిల్లు ఉండాలి– ఆర్.పద్మ, అసిస్టెంట్ కమిషనర్, జీఎస్టీ భువనగిరి బియ్యంపై ఎలాంటి పన్ను లేదు. 25 కిలోల బ్యాగ్‌కు మాత్రమే జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. వేబిల్లు అవసరం లేదు. ఎక్కడి నుంచి ఎటు రవాణా చేస్తున్నారు.. బిల్లు ఉంటే సరిపోతుంది.

## నీటి వనరుల రక్షణకు అడుగులు

నల్గొండ : సూర్యాపేట సద్దుల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల పరిధిలో ఇటీవల సర్వేకు వెళ్లారు. బాధితులు సర్వేను అడ్డుకోవడంతో పాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో జనావాసం లేని ప్రాంతాల్లో చెరువులను ఆక్రమించి స్థిరాస్తి వ్యాపారం చేస్తూ వెంచర్లు వేసిన వాటిని తొలి దశలో సర్వే చేయనున్నట్లు తెలిసింది. పురపాలికల్లో రెవెన్యూ, నీటిపారుదల శాఖలతో కలిసి పుర అధికారులు, మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ఈ సర్వేలు నిర్వహించనున్నట్లు తెలిసింది.

పక్షం రోజుల్లో ఎక్కువ ఆక్రమణలున్న వాటిని గుర్తించి ఎంత మేరకు భూమి కబ్జాకు గురయిందో నిర్ధారించి తదుపరి చర్యలను సూచించాలని తెలుపుతూ సమగ్ర నివేదికను సర్కారుకు సమర్పించనున్నారు. ఉమ్మడి జిల్లాలో గత సర్వే ప్రకారం వివరాలు మొత్తం చెరువులు, కుంటల సంఖ్య: 4454

50 శాతం కంటే ఎక్కువగా ఆక్రమణకు గురైనవి: 250

25 శాతం మేర అన్యాక్రాంతమైనవి: 500

మరికొన్ని చెరువులు పాక్షికంగా ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు ప్రభుత్వ ఆదేశాలతో నీటి వనరులకు రక్షణగా అధికార యంత్రాంగం కదులుతోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోని నీటి వనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఆక్రమణలు ఏమైనా ఉన్నాయా, కబ్జాలకు గురయ్యాయా.. అనే వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఈ సర్వేలతో ఆందోళన చెందుతున్నారు.

అనుమతుల్లేకుండానే నిర్మాణాలు

రెవెన్యూ శాఖలోని లొసుగులు, నీటిపారుదల, పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో చాలా చెరువుల్లోని శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతుల్లేకుండానే నిర్మాణాలు చేపట్టారు. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారితో పాటు నార్కట్‌పల్లి – అద్దంకి రహదారుల పక్కన ఉన్న చెరువులు గత పదేళ్లలో అనేకం కబ్జాకు గురయ్యాయి. స్థిరాస్తి వ్యాపారులకు స్థానిక రాజకీయ నాయకుల అండ ఉండటంతో ఈ క్రతువు గత పదేళ్లలో యథేచ్ఛగా సాగింది. నల్గొండ, చౌటుప్పల్, భువనగిరి, కోదాడ, మిర్యాలగూడ, బీబీనగర్, కోదాడ ప్రాంతాల్లో ఈ ఆక్రమణల దందా ఎక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లోనే అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వగా... చాలా ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టారు. కబ్జా దృష్టాంతాలు కొన్ని..

నల్గొండ పురపాలిక పరిధి కేశరాజుపల్లిలో నార్కట్‌పల్లి –అద్దంకి రహదారి పక్కనే పాతపల్లెకు వెళ్లే మార్గంలో మేడికుంట చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో రూ.కోట్లు విలువైన స్థలంలో కొందరు వ్యాపారులు ప్రహరీ నిర్మించారు. కతాల్‌గూడ చెరువు కనుమరుగవుతోంది. కోదాడ పెద్ద చెరువు సైతం సుమారు 200 ఎకరాల్లో కబ్జాకు గురైందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పెద్ద చెరువు అలుగుకు అడ్డంగా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతోనే ఇటీవల వరదలు వచ్చాయని ప్రభుత్వానికి అధికారులు నివేదిక సమర్పించారు. నకిరేకల్ పెద్దచెరువును రూ.6 కోట్ల వ్యయంతో మినీ ట్యాంకుబండుగా అభివృద్ధి చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో సుమారు 40కిపైగా అక్రమ నిర్మాణాలున్నట్లు గతంలోనే అధికారులు గుర్తించారు. భువనగిరి, బీబీనగర్ మండలాల్లోనూ పలు చెరువులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. చౌటుప్పల్ మండలంలోనూ పలు చెరువుల్లో స్థిరాస్తి వ్యాపారులు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. సూర్యాపేట సద్దుల చెరువులో ప్రస్తుతం సర్వే కొనసాగుతోంది.

# జుంటివాగు.. అప్పుడే ఒట్టిపోయె!

బషీరాబాద్: భారీ వర్షాలతో మొన్నటి వరకు కళకళలాడిన జుంటివాగు అప్పుడే వెలవెలబోతోంది. చెక్‌డ్యాం కుడివైపున వింగ్‌వాల్స్‌కు భారీ గండి పడడంతో నీరంతా వృథాగా కాగ్నానదిలోకి తరలిపోయింది. గతంలో మరమ్మతులు చేపట్టిన గుత్తేదారు నాసిరకంగా పనులు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.అరకోటి నిధులతో పనులు..**

ఆరేళ్ల క్రితం జుంటివాగు మరమ్మతుల కోసం అప్పటి ప్రభుత్వం రూ.50లక్షల నిధులు మంజూరు చేసింది. గుత్తేదారు పనులు చేపట్టి చెక్‌డ్యాం కింది భాగం మరమ్మతులు, ఎత్తు పెంచడం, కాల్వలు, తూము బాగు చేయడం వంటి పనులు చేశాడు. ఇందుకు అధికారులు రూ.25లక్షల బిల్లులు చేశారు. వింగ్‌వాల్స్ పనులు, చెక్‌డాం వద్ద మరికొంత పనులు చేయకుండానే గుత్తేదారు వదిలేశాడు. దీంతో కొత్త పనులు ప్రతిపాదించలేక అధికారులు సైతం వదిలేశారు.




జుంటివాగు చెక్‌డ్యాం లీకేజీ, వింగ్‌వాల్స్ పనులు నాణ్యతగా చేయకపోవడంతో మొదటికే మోసమొచ్చింది. చిన్నగా ఏర్పడిన లీకేజీ కాస్త.. కురిసిన వర్షాలకు భారీ గండి పడింది. దీంతో నీరంతా వృథా అయిపోయింది. పనులు చేసినా ప్రయోజనం సున్నా– వెంకటయ్య, ఆయకట్టు రైతు. జుంటివాగు మరమ్మతులకు అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంగం పనులు మాత్రమే అయ్యాయి. అవీ నాణ్యతగా జరగలేదు. ప్రస్తుతం చెక్‌డ్యాంకు కుడివైపున భారీగండి ఏర్పడింది. పూడ్చాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. అప్పట్లోనే పనులు బాగా చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అధికారులు స్పందించి ఇప్పటికైనా బాగు చేయించాలి.

**ఉన్నతాధికారులకు తెలిపాం – సాయి, ఏఈ, సాగునీటిశాఖ**

జుంటివాగు గండి విషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. నేను ఇక్కడ విధులకు రాక ముందే ఈ పనులు జరిగాయి. అన్నీ అసంపూర్తిగా ఉన్నాయి. గుత్తేదారు ఇంకా చేయాల్సి ఉంది. మేం వింగ్‌వాల్స్‌కు తాత్కాలిక మరమ్మతులు చేయించాం. అయినా నీటి ఉధృతికి గండి పడింది.

# రెప్పదాటని కన్నీళ్లు

హైదరాబాద్ : మాదాపూర్‌లోని కార్పొరేట్ సంస్థలో ఆమె 15 ఏళ్లుగా పని చేస్తూ గుర్తింపు తెచ్చుకుంది. అదేచోట ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి నుంచి లైంగిక వేధింపులు మొదలయ్యాయి. ఎవరికీ చెప్పుకోలేక కుంగుబాటుకు గురయ్యారు. తనవల్ల కాదని రాజీనామా చేశారు. ఇలా ఎంతోమంది ఇంటా బయటా లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొనే వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీలు నామమాత్రంగా మారాయి. కొన్ని సంస్థలు కమిటీలనే ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.



దిల్లీకి చెందిన ఒక సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే లో 59 శాతం కంపెనీలు లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయలేదని గుర్తించారు.

**ఫిర్యాదు చేయండిలా**

వాట్సాప్ నంబర్లు

94906 16555, 87126 56858

డయల్ 100, చైల్డ్‌లైన్ 1098

వెబ్‌సైట్: %womensafetywing. telangana.gov.inభయంతోనే బాధితుల వెనకడుగు

– డాక్టర్ మమతా రఘువీర్, తరుణి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్

దేశవ్యాప్తంగా 0.4 శాతం మంది మహిళలు మాత్రమే పనిచేసే చోట ఎదురవుతున్న లైంగిక వేధింపులపై ఫిర్యాదుకు ముందుకొస్తున్నారు. అంతర్గత కమిటీలు నామమాత్రంగా మారాయి. యాజమాన్యం నిర్లక్ష్యంతో మహిళా ఉద్యోగులు కొలువులు వదిలేస్తున్నారు.

# అసలే ఇరుకు ఆపై కొత్త ధాన్యం

హుజూర్‌నగర్ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రస్తుత వానాకాలంలో వర్షాలు బాగా కురవడంతో వరి సాగు జోరందుకుంది. మరో వారం రోజుల్లో పంట చేతికి రానున్నందున కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే మిల్లుల్లో రెండేళ్ల నాటి యాసంగి ధాన్యం నిల్వ ఉంది. వాటిని తరలించకుంటే, స్థలం ఉండదని, ఇప్పుడు కొన్న వడ్లను తమకు కేటాయిస్తే ఎక్కడ నిల్వ చేయాలని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

అప్పుడేమైందంటే..?రెండేళ్ల క్రితం యాసంగిలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యంలో 7,89,275 మెట్రిక్ టన్నులను విక్రయించాలని నిర్ణయించింది. మిల్లుల్లో నిల్వచేసిన వడ్లను అప్పుడే వేలం వేశారు. తక్కువ ధరకు గుత్తేదారుకు అప్పగించారనే ఆరోపణలతో ఆ వేలాన్ని రద్దుచేశారు. ఈ లోపు ఎన్నికలొచ్చాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఈ సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. తొమ్మిది నెలల క్రితం తిరిగి వేలం వేశారు. ఆ వేలంలో ధాన్యాన్ని దక్కించుకున్న గుత్తేదారు 2,46,978 మెట్రిక్ టన్నులను మాత్రమే తీసుకెళ్లారు. ఇంకా 5,42,297 ఎంటీల వడ్లు ఉమ్మడి జిల్లాల్లోని మిల్లుల్లోనే ఉన్నాయి. వాటిని మూడు నెలల్లో తీసుకెళ్లాలని ప్రభుత్వం తాజాగా గుత్తేదారుకు గడువిచ్చింది. ఆ ధాన్యం బాగా చెడిపోవడంతో పరిహారంగా డబ్బు చెల్లించాలని గుత్తేదారు కోరుతున్నారు. ఒప్పుకున్న కొందరు మిల్లర్లు చెల్లించారు. చాలామంది తమకు సంబంధం లేదని, కొనుగోలు కేంద్రం నుంచి అలాగే వచ్చిందని చెబుతున్నారు. దీంతో గుత్తేదారు ఆ మిల్లుల నుంచి ధాన్యం తీసుకెళ్లడం లేదని తెలిసింది. మిల్లులో ఎక్కువ ధాన్యం ఉండటం వల్ల స్థలం సమస్య ఏర్పడుతోందని, కొత్త ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. నల్గొండ జిల్లాలో అక్టోబరు మొదటి వారంలో ప్రస్తుత వానాకాలానికి సంబంధించిన కొత్త ధాన్యం వస్తుందని అధికారుల అంచనా వేశారు.

# వామ్మో అప్పులు!



కరీంనగర్ : జిల్లాలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో నగర, పురపాలికల్లో వేల సంఖ్యలో స్వశక్తి సంఘాలు పని చేస్తున్నాయి. మహిళల ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, వ్యక్తిగత రుణాలు బ్యాంకుల ద్వారా మంజూరు చేస్తోంది. అర్హత ఉన్న మహిళా సంఘాలను ఏటా ఎంపిక చేసి.. బ్యాంకులకు పంపిస్తుండగా.. ఒక్కో సంఘానికి రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నాయి. మహిళలు ఉపాధితోపాటు ఇతర అవసరాలకు వీటిని వినియోగించుకుంటున్నారు. కొందరు చెల్లించలేకపోవడంతో వడ్డీ, అసలు కలిపి భారంగా మారుతున్నాయి.

**బ్యాంకర్ల పర్యవేక్షణ లేకనే బకాయిలు**

మహిళా సంఘాలు తీసుకున్న రుణాన్ని మూడు నెలల వ్యవధిలో చెల్లించకుండా దాటేసే స్థితికి వస్తే.. బ్యాంకర్లు పరిశీలించి ఆ సంఘాల దగ్గరకు వెళ్లి ఆరా తీయాలి. కానీ క్షేత్రస్థాయిలో అలా జరగడంలేదు. మెప్మాతో సంబంధం లేకుండా కొన్ని బ్యాంకులు రుణాలు ఇవ్వడం కూడా సమస్యలకు కారణంగా మారుతోంది. గతంలో ఆన్‌లైన్ విధానం లేకపోవడం, రుణాలు తీసుకున్న వారికే ఇవ్వడంతో సంఘాలు అప్పులు చెల్లించలేనిస్థితికి చేరుకున్నాయి. పైగా పది మంది సభ్యులలో కొందరు ఇతర కారణాలతో వైదొలగడం, మరికొందరు సంఘ సభ్యులలో మొత్తం మంది లేకుండానే రుణాలు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇలా బినామీ సంఘాల పేరుతో స్వాహా చేసిన ఘటనలు గతంలో వెలుగులోకి వచ్చాయి. ఇదంతా బ్యాంకర్లు పర్యవేక్షణ చేసి రుణాలు ఇవ్వడం, రికవరీ చేసుకోవాల్సి ఉంటుంది.

**ఆన్‌లైన్ ఎంసీపీలతో స్వశక్తి రుణాలు..**

స్వశక్తి సంఘాలకు సులువుగా రుణాలు అందించేందుకు వీలుగా మైక్రో క్రెడిట్ ప్లాన్(ఎంసీపీ)లను ఆన్‌లైన్ ద్వారా వచ్చే వాటినే పరిగణనలోకి తీసుకునేలా నగరపాలక కమిషనర్ ఆదేశించారు. అక్రమాలకు తావివ్వకుండా, బకాయిలు ఉన్న వారికి రుణాలు ఇచ్చే అవకాశముండదు. ఏయే సంఘాలకు రుణాలు ఇచ్చారనే విషయం కూడా మెప్మా అధికారులకు ఎప్పటికప్పుడు తెలియనుంది.

**సకాలంలో చెల్లిస్తే తిరిగి వడ్డీ జమ**

మహిళా సంఘాలు బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకుంటే నిర్ణీత గడువులోగా ప్రతి నెలా చెల్లించాలి. ః ముందుగా వడ్డీ భారం పడినా రాష్ట్ర ప్రభుత్వం ఆ మొత్తాన్ని తిరిగి ఖాతాల్లో జమ చేస్తోంది.

**43 శాఖల్లో రూ.17.88 కోట్లు**

నగర వ్యాప్తంగా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీతోపాటు ఇతర రకాల రుణాలు ఇస్తున్నాయి. మొత్తం 72 బ్యాంకుల శాఖలలో సంఘాలు ఉండగా, 43 శాఖలలో 562 సంఘాలు రూ.17.88 కోట్లు బకాయిపడ్డాయి. వందకు పైగా సంఘాలు భారీ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఇదంతా 2018 వరకే ఉన్నట్లు సమాచారం. ఈ సంఘాలన్నీ మొండి పద్దుల కింద పరిగణనలోకి తీసుకోవడం, ఎప్పటిలోగా చెల్లిస్తారనే గ్యారంటీ కూడా లేకుండాపోయింది. ఇటీవల నగరపాలక కార్యాలయంలో బ్యాంకర్లతో కమిషనర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మొండి పద్దులు వసూలు చేయాలని ఆదేశాలు కూడా జారీ చేశారు.

డివిజన్లు : 60

ప్రస్తుత మహిళా సంఘాలు : 4,223

సమాఖ్యలు : 156

పట్టణ సమాఖ్యలు : 2

రుణం చెల్లించని సంఘాలు: 576

బకాయి రూ.కోట్లు : 17.88

# సింగరేణి సిగలో మరో విద్యుత్తు కేంద్రం



గోదావరిఖని: మరో 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలని సింగరేణి ప్రణాళికలు రచించుకుంటుంది. ఇప్పటికే ఆ పనులు టెండర్ దశకు చేరుకున్నాయి. పదేళ్ల క్రితం మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఎస్టీపీపీలో మరో ప్లాంటు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా పురోగతి లేకుండా పోయింది. ఇటీవల దానిపై తిరిగి పనులు చేపట్టేందుకు యాజమాన్యం ప్రణాళికలు చేసింది. దానికి సంబంధించిన నివేదికలు తయారు చేసిన సింగరేణి.. త్వరలో టెండరు పిలిచేందుకు ఏర్పాట్లు చేసింది. త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు కూడా ప్రజాప్రతినిధుల సమయం కోసం వేచి చూస్తుంది. ఇదివరకే జైపూర్ వద్ద 1200 మెగావాట్ల రెండు యూనిట్లను నిర్మించింది.

**రూ.10 వేల కోట్ల వ్యయంతో..**

రెండో దశలో నిర్మించే 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్ర నిర్మాణానికి సంబంధించిన అంచనాలు తయారు చేసింది. సుమారు రూ.10 వేల కోట్ల వ్యయంతో పనులు చేపట్టాలని భావిస్తుంది. అయితే పనులను ఎవరికి అప్పగించాలనే సమాలోచనలో ఉంది. మొదటి దశలో నిర్మించిన రెండు యూనిట్లకు సంబంధించిన పనులను బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. అవసరమైన బొగ్గు, నీరు అందుబాటులోనే ఉండటంతో.. పనులు పూర్తికాగానే ఉత్పత్తికి ఇబ్బంది ఉండదన్న అభిప్రాయం ఉంది. సింగరేణి గనుల నుంచి వెలికి తీసిన బొగ్గును ఈ ప్లాంటుకు వినియోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే సింగరేణి విద్యుత్తు కేంద్రం కోసం శెట్టిపల్లి వద్ద నిర్మించిన జలాశయం నుంచి నీటిని తీసుకొనే వెసలుబాటు ఉంది.

3,500 మెగావాట్ల ఉత్పత్తిపై దృష్టిథర్మల్ విద్యుత్తు కేంద్రాలతోపాటు సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను సింగరేణి నిర్మించింది. రెండు కేంద్రాల ద్వారా 1200 మెగావాట్లను విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి.. 278 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. వీటికితోడు మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి సిద్ధమైన సింగరేణి.. మరో 500 మెగావాట్ల హైడ్రో విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. వీటితోపాటు జలాశయాలపై 500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తంగా 3,500 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయనుంది. రాష్ట్ర విద్యుత్తు అవసరాలు తీర్చే దిశగా సింగరేణి ప్రణాళికలు చేసుకుంటుంది.

# బుద్ధవనంతో సాగర్ రహదారి విస్తరణ



యాచారం : నాగార్జున సాగర్‌లోని బుద్ధవనం పుణ్యమా అని హైదరాబాద్–నాగార్జున సాగర్ రహదారి విస్తరణకు మోక్షం లభించనుంది. బౌద్ధ పర్యాటక ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో భాగంగా ఈ అంతర్రాష్ట్ర ప్రధాన రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించడం తెలిసిందే. దీంతో అధికారుల్లో కదలిక మొదలైంది. ప్రైవేటు ఏజెన్సీ ద్వారా డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక) డీపీఆర్ సిద్ధంచేస్తారు. తరువాత నిధులు కేటాయించి పనులుప్రారంభిస్తారు. ఏడు మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డును కృష్ణా పుష్కరాల వేళ 2016లో 10 మీటర్ల(రెండు వరుసలు) వెడల్పుగా విస్తరించారు. ఇప్పుడు నాలుగు వరుసలు(16 మీటర్లు)గా విస్తరించనున్నారు.

**అప్పట్లో రూ.300 కోట్లతో ప్రతిపాదనలు**

సాగర్ రహదారి విస్తరణపై అధికారులు రెండేళ్ల క్రితమే అంచనాలు రూపొందించారు. ఇరువైపులా ఉన్న కృష్ణా తాగునీటి పైపులైన్ల కారణంగా రోడ్డు విస్తరణ సాధ్యాసాధ్యాలపై ఆర్అండ్‌బీ, మహానగర జలమండలి అధికారులు సంయుక్త సర్వేచేశారు. యాచారం మండలం తక్కళ్లపల్లి మినహా మిగిలిన చోట్ల నాలుగు వరుసలుగా విస్తరించవచ్చని గుర్తించామని ఆ సర్వేలో పాల్గొన్న డీఈ వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ, యాచారం మండలం గున్‌గల్, మంచాల మండలం ఆరుట్ల వద్ద అండర్‌పాస్ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇబ్రహీంపట్నంవద్ద కృష్ణా పైపులైన ఉన్న బైపాస్‌రోడ్డు జలమండలి ఆధీనంలో ఉంది. మొత్తం రహదారి నాలుగు వరుసల అభివృద్ధికి రూ.300కోట్లు అవసరమవుతాయని ప్రాథమిక అంచనాను ప్రభుత్వానికి అందజేశారు. నిధుల కొరతతో డీపీఆర్ సిద్ధంచేయలేదు. ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.


ప్రస్తుతం ఇదీ పరిస్థితి హైదరాబాద్‌నుంచి మాల్ వరకు 60 కి.మీ.ల సాగర్ రహదారి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉంది. మిగిలిన రహదారి నల్గొండ జిల్లాలో ఉంటుంది. నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డునుంచి ఓఆర్ఆర్(బొంగులూరు) వరకు 6 వరుసలుగా, అక్కడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు 4 వరుసలుగా రహదారి ఉంది. ఇబ్రహీంపట్నం నుంచి సాగర్ వరకు నాలుగు వరుసలుగా విస్తరించి మధ్యలో విభాగిని ఏర్పాటుపనులు కొత్తగా చేపట్టాల్సి ఉంటుంది.

**త్వరలో డీపీఆర్ పనులు– మధుసూదన్, ఈఈ, ఆర్అండ్‌బీ**

సాగర్ రహదారి విస్తరణకు డీపీఆర్ రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. విస్తరణ పనులు హైవేస్ అథారిటీలీ ద్వారా చేయిస్తారా లేక ఆర్అండ్‌బీ శాఖతో చేయిస్తారా అనేది స్పష్టం కావాల్సి ఉంది.

# రూ.9.90లకే జీబీ డేటా ఇస్తున్నాం!

హైదరాబాద్: 'ప్రైవేటు టెలికాం సంస్థలతో పోల్చుకుంటే బీఎస్ఎన్ఎల్ సేవలు ఎంతో చవకైనవి. రూ.9.90 పైసలకే ఒక జీబీ డేటా ఇస్తున్నాం. ఇంత తక్కువ ధరలో ఏ టెలికాం ఆపరేటర్ ఇవ్వడం లేదు. ఇంటర్నెట్ వేగాన్ని పెంచేందుకు అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశోధనలు చేస్తున్నాం. వచ్చే ఆరేళ్లలో ఆరో జనరేషన్(6–జీ) సేవల్లో పది శాతం బీఎస్ఎన్ఎల్ వాటా ఉండాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ సమాచార నెట్‌వర్క్ లేని 26వేల గ్రామాల్లో వీలైనంత వేగంగా సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయనున్నాం. విద్యార్థులు, యువత మా నెట్‌వర్క్‌కు ఆకర్షితులయ్యేలా ప్రణాళిలు అమలు చేస్తున్నా"మని కేంద్ర టెలికాం శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్(ఐసీటీ) అతుల్ సిన్హా అన్నారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన మాట్లాడారు. ప్రైవేటు టెలికాం ఆపరేటర్లు రీఛార్జీ ధరలు పెంచినా.. తాము మాత్రం పెంచడం లేదని తెలిపారు.గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యం.. ప్రైవేటు, కార్పొరేటు, విదేశీ టెలికాం ఆపరేటర్లు పట్టణాలు.. నగరాలకే ప్రాధాన్యమిస్తుండగా.. వివిధ రాష్ట్రాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకే మేం ప్రాధాన్యమిస్తున్నాం. బ్యాంకులు, ఆసుపత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావ




డంతో ఇంటర్నెట్ కనెక్టివిటీకి ప్రాధాన్యం పెరిగింది. నగదుకు బదులుగా డిజిటల్ చెల్లింపులు పెరిగాక గ్రామాల్లో మహిళలు, పిల్లలు జీపే, ఫోన్‌పే, పేటీఎం, భీమ్‌లను ఎంచుకుంటున్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకునే 26వేల గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

**కొత్త సంవత్సరంలో 5జీ సేవలు**

ఇంటర్నెట్, మొబైల్ సేవల్లో ప్రైవేటు, సంస్థలతో పోలిస్తే.. వేగంగా ముందుకు వెళ్తున్నాం. కొత్త సంవత్సరంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 5జీ సేవలు అందించనున్నాం. 5జీ టెక్నాలజీని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించాం. చరవాణులు, బ్రాడ్‌బాండ్ సహా ఇతర ఫ్రీక్వెన్సీలకు ఇది ఉపయోగపడనుంది. విదేశీ సంస్థలకు దీటుగా సాంకేతిక పరిజ్ఞానం ఉండడంతో మెట్రో నగరాల్లో విద్యార్థులు, యువకులు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను ఇష్టపడుతున్నారు.


# బల్దియాకు పన్ను దన్ను

హైదరాబాద్: ఆస్తి పన్ను సవరణపై జీహెచ్ఎంసీ దృష్టి పెట్టింది. పాత ధరలతో పన్ను చెల్లిస్తున్న నిర్మాణాలు, మరో నాలుగు కేటగిరీల్లోని కట్టడాలను తొలుత లక్ష్యంగా చేసుకుంది. చదరపు అడుగుకు 60 పైసలు, 80 పైసల చొప్పున పన్ను చెల్లించే కట్టడాలకు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సుమోటోగా నోటీసుల జారీని ప్రారంభించారు. నాలుగు కేటగిరీల్లోని రెండు లక్షల నిర్మాణాలను సర్వే చేస్తే.. మొత్తంగా రూ.50కోట్ల మేర ఆదాయం పెరగొచ్చని బల్దియా అంచనా.

తగ్గిన వసూళ్లు..గత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో పోలిస్తే.. ఈ నెలలో పన్ను వసూళ్లు తగ్గుముఖం పట్టాయి. దాంతో నెల జీతాలకు అవసరమైన నిధులపై జీహెచ్ఎంసీ ఆందోళనలో పడింది. ఇటీవల మొదలైన ఓటరు సర్వేలో, ఇతరత్రా కార్యక్రమాల్లో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు నిమగ్నమయ్యారు. సమీక్షలు జరగడం లేదని, పన్ను రాబడిని నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

**వివరాల సేకరణతో ముందుకు..**

పాత ధరలతో పోలిస్తే వార్షిక పన్ను 20–40శాతం మేర పెరగనుంది. ఈ ఆర్థిక సంవత్సరం పన్ను ఇప్పటికే చెల్లించిన చాలామందికి, ఇటీవల సవరణతో ఇంటి పన్ను పెరిగిన విషయం తెలియదు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని జనప్రియ, ఇతరత్రా పాత అపార్టుమెంట్లలోని ఇళ్లకు ఒక్కసారిగా నోటీసులివ్వడంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. విషయం కేంద్ర కార్యాలయానికి చేరడంతో, తక్కువ పన్ను చెల్లించే కేటగిరీలోని ఇళ్లకు నోటీసులు వద్దని కమిషనర్ ఆమ్రపాలి స్పష్టంచేశా




రు. తప్పుడు వివరాలతో, తక్కువ పన్ను చెల్లిస్తున్న నాలుగు రకాల నిర్మాణాలపై మాత్రం వెనక్కి తగ్గొద్దని, జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 213 ప్రకారం నోటీసులిచ్చి, పన్ను విలువ సవరించాలని బల్దియా నిర్ణయించింది. అందులో భాగంగా విద్యుత్తుశాఖ వద్ద ఉన్న సమాచారాన్ని తీసుకుంది. నివాస కేటగిరీలో పన్ను చెల్లిస్తున్న 50వేల నిర్మాణాలకు వాణిజ్య కోటా విద్యుత్తు సరఫరా అవుతున్నట్లు తేలింది.

**వీరిపైనే దృష్టి.. సున్నా విస్తీర్ణం సున్నా ఆస్తిపన్ను**

ఏడాదికి రూ.101 పన్ను చెల్లిస్తున్న వ్యాపార కేంద్రాలు

వాణిజ్య కేటగిరీ విద్యుత్తు కనెక్షన్లున్న భవనాలు, ఇళ్లు

# భూమి పూజ చేసి... పనులు మరిచి

వేములవాడ: ఏటా వర్షాకాలంలో కాలువ పొంగితే చాలు రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో దాదాపు ఎనిమిది గ్రామాలతో పాటు ఆ మార్గం వైపు వెళ్లేవారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయినా అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా వంతెన నిర్మాణం చేపట్టని దుస్థితి నెలకొంది.

వేములవాడ పట్టణ శివారు మల్లారం రోడ్డులోని కట్టు కాలువ ఏటా భారీ వర్షాలకు పొంగి పొర్లడంతో ఈ ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కల్వర్టు వద్ద హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. దాదాపు రెండేళ్ల క్రితం రూ.2.5 కోట్లు మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే రమేశ్‌బాబు వంతెన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. దీంతో పాటు శాత్రాజుపల్లి వద్ద వంతెన నిర్మాణానికి కూడా భూమిపూజ చేశారు. ఇందులో శాత్రాజుపల్లి వద్ద వంతెన పూర్తి కాగా ఈ వంతెన నిర్మాణం ఏడాది గడిచినా ముందుకు సాగడం లేదు.

**ఎనిమిది గ్రామాల ప్రజలకు అవస్థలు**

పట్టణ శివారులోని కల్వర్టు భారీ వర్షం కురిస్తే భీమేశ్వర కాలువ నీటితో పాటు వ్యవసాయ పంట పొలాల నుంచి భారీగా వరద ఈ కాలువలో చేరుతుంది. దీంతో ఈ కల్వర్టు వద్ద భారీగా వరద చేరడంతో రవాణా స్తంభించిపోతుంది. కల్వర్టు అవతలి వైపు ఉన్న జయవరం,



మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి గ్రామాలతో పాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలు, మరోవైపు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతుంటారు. ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల మీదుగా వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మార్గం మీదుగా నిజామాబాద్ జిల్లా సిరికొండకు రవాణా సౌకర్యం నిలిచిపోతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ వంతెన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఈ ప్రాంత గ్రామాలకు చెందిన వారి నుంచి నిరసన వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు కోరుతున్నారు.

**వర్షాకాలం తరవాత పనులు ప్రారంభిస్తాం**

వంతెన నిర్మాణ పనులు వర్షాకాలం తరవాత చేపట్టడం జరుగుతుంది. గుత్తేదారు కొన్ని కారణాల వల్ల పనులు చేపట్టలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో భారీ వర్షాలు కురిస్తే పనులు సాగవు. ప్రజలు ఇబ్బందులు పడతారు. ముందుగా కల్వర్టు వద్ద డైవర్షన్ రోడ్డు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా వంతెన పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. శాంతయ్య, డీఈఈ, ఆర్అండ్‌బీ, వేములవాడ

# ప్రతి మొక్కకూ ఒక లెక్క

కొత్తగూడెం : పర్యావరణ పరిరక్షణతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యమవుతుంది. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచాలనే లక్ష్యంతో ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న 'వన మహోత్సవం' కార్యక్రమం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ముమ్మరంగా సాగుతోంది. భద్రాద్రి జిల్లాలో ఇప్పటికే లక్ష్యానికి మించి మొక్కలు నాటగా.. ఖమ్మం జిల్లాలో 84 శాతం పూర్తయ్యింది. మిగతా మొక్కలు నాటేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు యత్నిస్తున్నారు.

**లక్ష్యాలు చేరని పురపాలికలు**

ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా ఉభయ జిల్లాల్లోని మున్సిపా లిటీలు మొక్కలు నాటేందుకు ఆసక్తి చూపించినట్లు కనిపించటం లేదు. భద్రాద్రి జిల్లాలోని నాలుగు పురపాలికలకు అయిదు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్ణయించగా.. సంబంధిత అధికారులు 3.37లక్షల మొక్కలు మాత్రమే నాటారు. ఖమ్మం జిల్లాలోని ఒక నగరపాలిక, మూడు పురపాలికల్లో 4.78 లక్షల లక్ష్యానికి కేవలం 1.40 లక్షల మొక్కలు నాటడంతోనే సరిపెట్టుకున్నారు. ఉభయ జిల్లాల్లోని అటవీ, డీఆర్‌డీఏ శాఖల అధికారులు లక్ష్యానికి మించి మొక్కలు నాటారు.

**నాటిన వాటిని సంరక్షించేలా..**

గతంలో హరితహారం కింద చేపట్టిన మొక్కల పెంపకం మిశ్రమ ఫలితాలనిచ్చింది. ఉభయ జిల్లాల్లోని అధికార యంత్రాంగం మొక్కలు నాటడంపై పెట్టిన శ్రద్ధ వాటి సంరక్షణపై చూపటం లేదనే విమర్శలున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది చేపట్టిన వన మహోత్సవంలో.. నాటిన ప్రతి మొక్కను రక్షించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇందులో ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేస్తోంది. జియో ట్యాగింగ్ యాప్‌లో ఎక్కడెక్కడ ఎన్ని మొక్కలు నాటారనే వివరాలు పొందుపరుస్తోంది. ఎక్కడైతే మొక్కలు నాటుతారో అక్కడ నావిగేషన్‌తో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తపరుస్తోంది. తద్వారా నాటిన మొక్క ఏవిధంగా ఉందనేది ఆన్‌లైన్ ఆధారంగా తెలుసుకోవచ్చు.

**క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇలా..**




ప్రతి జిల్లాలోని భూవిస్తీర్ణంలో 33 శాతం అడవులు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏటా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. అందులో భాగంగా ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో 32 లక్షలు, భద్రాద్రి జిల్లాలో 65 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కీలకపాత్ర పోషించగా.. అటవీ, రెవెన్యూ, పోలీసు, సింగరేణి, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, పశుసంవర్ధక, వ్యవసాయ, ఉద్యాన, మహిళా సంక్షేమం, ఎక్సైజ్, విద్యాశాఖలు భాగమయ్యాయి. కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా సంబంధిత అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

# గడప చేరినా.. గొంతు తడవడం లేదు

పరిగి: ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన 'మిషన్ భగీరథ' జిల్లాలో ఇంకా ప్రజలకు చేరువ కావడంలేదు. పట్టణాల విషయం ఎలాఉన్నా కనీసం పల్లె గొంతునూ తడపలేకపోతోంది. నిజానికి ఈ నీటిలో అనేక ఖనిజ లవణాలున్నా తాగేందుకు చాలా మంది ఇష్టపడటం లేదు. రూ.20చెల్లించి డబ్బా నీటినే కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు ప్రధానంగా 'అవగాహన లోపం' ఒక కారణమైతే, పంచాయతీల నిర్వహణ లేమి మరో కారణంగా నిలుస్తోంది.

**నిల్వ సదుపాయాలేవీ..**

శ్రీశైలం రిజర్వాయరు నుంచి పరిగి మండలం రాఘవాపూర్ సమీపాన ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ప్లాంటుకు సరఫరా జరుగుతోంది. అక్కడి నుంచి జిల్లాలోని పంచాయతీలకు పంపిణీ చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా నీటిని నిల్వ చేసుకునే సదుపాయం మున్సిపాలిటీలతో సహా గ్రామాల్లో లేదు. దీంతో పంచాయతీల్లోని మోటార్లతో కలిపి సరఫరా చేస్తున్నారు. తాండూరులో అస్తవ్యస్తం

తాండూరు పట్టణ వాసులకు నిత్యం తాగునీటి సరఫరాకు రెండేళ్ల కిందట భగీరథ ట్యాంకులు నిర్మించారు. పైపు లైన్లు పూర్తి కాలేదు. ఈ నీరు వస్తుందనే ధీమాతో ఏళ్ల నుంచి ప్రజల దాహార్తిని తీర్చిన కాగ్నా నది ఒడ్డున ఉన్న పాత, కొత్త రెండు పంప్‌హౌస్‌లను మూసివేశారు. అటు పంప్ హౌస్‌లు పనిచేయక, ఇటు భగీరథ నీరు సక్రమంగా రాక పట్టణ వాసులు నానా అవస్థలు పడుతున్నారు.

**ఇలా చేస్తే మేలు**అధిక నీటి నిల్వ సామర్థ్యం కలిగిన భూ ఉపరితల ట్యాంకుల ఏర్పాటు. లేని పక్షంలో పంచాయతీ బోర్ల నీటిని, భగీరథ నీటిని వేర్వేరు సమయాల్లో సరఫరా చేయాలి.

గ్రామాల్లో భగీరథ నీటి ప్రయోజనాలను ప్రయోగాత్మకంగా వివరించడం.

లీకేజీలను సరిచేయడం.

పల్లెల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ అవసరం.

ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం

– సుబ్రహ్మణ్యం, డీఈఈ, నీటి సరఫరా విభాగం

ప్రతి ఒక్కరూ తాగాల్సిన స్వచ్ఛమైన నీరు మిషన్ భగీరథ. డబ్బా నీటిని కొనుగోలు చేయడం అనారోగ్యాన్ని డబ్బులు పెట్టి కొనుగోలు చేసినట్లే అవుతుంది. నీటి వినియోగం పై సందేహాలను నివృత్తి చేస్తూ ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం.

మిషన్ భగీరథ ప్రారంభం – 2018
నీటి సరఫరా–
శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్
ఎంత దూరం– 231 కి.మీ.
ఎక్కడికి సరఫరా– పరిగి మండలం
రాఘవాపూర్ సమీప నీటి సంపు
పంచాయతీలు– 566
రోజుకు నీటిశుద్ధి – 1.35లక్షల ఎంఎల్‌డీ
భూ ఉపరితల ట్యాంకులు– 806
ఏర్పాటు చేసిన నల్లా కనెక్షన్లు– 2.07లక్షలు
మరమ్మతులు చేపట్టాల్సినవి – 40,000
పైప్‌లైన్ల ఏర్పాటు– 1920.17కి.మీ
ఉమ్మడి రంగారెడ్డి కింద చేసిన వ్యయం – రూ.1800కోట్లు

# నిధులు రాక.. అధికారులు లేక!



కరీంనగర్ : పురపాలికలు, నగరపాలిక తరహాలో గ్రామాల్లో సైతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పంచాయతీల పరిధిలో నిధుల కొరత ఉంటుండటంతో ప్రజలందరికి సంబంధించిన పనులపై శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ(సుడా) ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా కసరత్తు చేసింది. ఆదాయ మార్గాలను అంచనా వేసుకుంటూ ఒక్కో పని చేసుకుంటూ వెళ్తోంది. రహదారులు, వీధిదీపాలు, హైమాస్ట్ లైట్లు, వాకింగ్‌ట్రాక్‌లు, ఓపెన్‌జిమ్‌లు వంటివి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు రూ.95.22 లక్షలు కేటాయించగా, ఎనిమిది పనులు పూర్తి చేశారు. బదిలీల కారణంగా పాత అధికారులు వెళ్లి.. కొత్త అధికారులు రావడంతో కొంత జాప్యం జరిగింది. మరిన్ని నిధులు సమకూరితే పనుల్లో వేగం పెరుగుతుంది.

**ఎల్ఆర్ఎస్ నిధులపై ఆశలు**

సుడా పరిధిలో అభివృద్ధి పనులు పరుగు పెట్టాలంటే నిధుల సమీకరణ ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం భవనాలు, ఇతర అనుమతులతోనే ఆదాయం రాగా కొత్తగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కరించడంతో నిధులు వస్తాయనే ఆశతో ఉన్నారు. ఉన్న నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. వీటి బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

**బదిలీల కారణంగా..**

సాధారణ బదిలీల్లో భాగంగా, గతంలో పని చేసిన ఒకరిద్దరు ఇంజినీరింగ్ అధికారులు వెళ్లిపోవడంతో కొత్త అధికారులు సుడాకు రావడంలో జాప్యం జరిగింది. రెండు నెలలుగా ఏఈ లేకుండాపోయారు. డీఈఈ కూడా రేపో, మాపో బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. పనులు పూర్తయిన చోట పనులను తనిఖీ చేసి బిల్లులు మంజూరు చేయాల్సి ఉంది.

**పూర్తయిన పనులు...**

చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు.
బొమ్మకల్ శ్రీపురంకాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
చాకుంటలో రూ.10 లక్షలతో వీధిదీపాలు
గుంటూరుపల్లి నుంచి కొనేరుపల్లి ఐకేపీ సెంటర్ వరకు రూ.5 లక్షలతో వీధిదీపాలు
కొత్తపల్లి మండలం చింతకుంటలో రూ.6 లక్షలతో అయిదు హైమాస్ట్ వీధిదీపాలు
ఎలగందల్‌లో రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు
కరీంనగర్ రూరల్ మండలం బహదూర్‌పేటలో రూ.5 లక్షలతో అయిదు హైమాస్ట్ లైట్లు
మానకొండూర్ మండలం ముంజంపల్లిలో రూ.2.22 లక్షలతో హైమాస్ట్ లైట్లు.


పెండింగ్‌లో ఉన్నవి...

వెదిరలో రూ.15 లక్షలతో ఓపెన్‌జిమ్, వాకింగ్‌ట్రాక్, వీధి దీపాలు
కొక్కరకుంటలో రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్
దేశ్‌రాజ్‌పల్లిలో రూ.10 లక్షలతో వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్
కిష్టాపూర్‌లో రూ.4 లక్షలతో ఓపెన్‌జిమ్, హైమాస్ట్ లైటు
చాకుంటలో రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్
ఒద్యారంలో రూ.3 లక్షలతో ఓపెన్‌జిమ్

అధికారులను ఆదేశించాం

అత్యవసరంగా, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. ఇటీవల వైస్ ఛైర్మన్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సమీక్షించాం.
కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఛైర్మన్, సుడా, కరీంనగర్

# సొంత గూడు ఎంత దూరం!



పెద్దపల్లి: ఇళ్లు లేని అర్హులైన పేదలందరికి ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ' ఇళ్ల పథకాన్ని ప్రకటించింది. గతేడాది డిసెంబరు 28 నుంచి ఈ సంవత్సరం జనవరి 6 వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించారు. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు త్వరలోనే తొలి విడత కింద ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించడంతో ఆశావహ లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 నియోజకవర్గాలకు 42 వేల ఇళ్లు మొదటి దశలో మంజూరవనున్నాయి. ఒక్కో ఇంటికి ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6 లక్షలు, ఇతర వర్గాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందనుం ది. జిల్లాస్థాయిలో అధికారులు మాత్రం ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని పేర్కొంటున్నారు. ప్రజాపాలన వెబ్‌సైట్ ప్రస్తుతం తెరచుకోకపోవడంతో అర్హులైన కొత్త దరఖాస్తుదారులూ నిరాశకు లోనవుతున్నారు. తమకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

**వేలల్లో ఇళ్లు.. లక్షల్లో దరఖాస్తులు**

ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలన కింద అర్జీలను స్వీకరించింది. సొంత స్థలం ఉండి ఇల్లు లేనటువంటి వారు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మహిళ పేరున పథకం అమలు చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 7,09,923 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గానికి మొదటి దశలో 3,500 చొప్పున 42 వేల మందికి ఇళ్లు మంజూరు అవ్వనున్నాయి. ఈ లెక్కన ఒక్కో ఇంటికి 1,690 మంది దరఖాస్తుదారులు పోటీ పడుతుండగా ఇందులో అర్హులను ఎంపిక ఎలా అనేదానిపై మంత్రులు, అధికారులు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నారు.

గత ప్రభుత్వం రెండు పడకల గదుల నిర్మాణాలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రారంభించనప్పటికి పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలోని రెండు, మూడు నియోజకవర్గాల్లో అక్కడక్కడా పంపిణీ చేశారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పూర్తయి లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికి మౌలిక వసతులు లేవనే కారణంతో వారికి ఇళ్లు కేటాయించలేదు. ఆ ఇళ్లను కూడా పూర్తి చేసి అర్హులైనవారికి ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

# మీకెందుకు.. ముందు చేరండి!

హైదరాబాద్: కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సుకున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు అదనపు సీట్ల పేరుతో మాయాజాలానికి తెరతీశాయి. తమ కళాశాలలో అదనంగా సీట్లు పెంచుకునేందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి అనుమతి ఇచ్చిందంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల్లో డొనేషన్లు తీసుకుంటున్నాయి. మూడో కౌన్సెలింగ్ పూర్తయినా సీటు రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ శివారులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల క్రితం సీట్లు రాని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరసనకు దిగారు. డబ్బు వెనక్కి ఇస్తామంటూ యాజమాన్యం చెప్పినా సీటే కావాలంటూ పట్టుబట్టారు. స్పాట్ అడ్మిషన్లలోపు అనుమతులు తీసుకువస్తామంటూ వారిని బతిమాలి పంపించారు.

**ఒక్కసీటు రూ.13 లక్షలు**కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సీటు కావాలంటే రూ.13 లక్షలు డొనేషన్‌గా ఇవ్వాలంటూ కొన్ని ప్రైవేటు కళాశాలలు రేటు నిర్ణయిం చాయి. రంగారెడ్డి జిల్లాలోని ఐదు ప్రముఖ కళాశాలలైతే రూ.20 లక్షలు చెప్పి రూ.17 లక్షలు తీసుకుంటున్నాయి. ఇప్పటికే 90 శాతం సీట్లను డొనేషన్లు తీసుకుని కేటాయించాయి. సంప్రదాయ




ఇంజినీరింగ్ కోర్సులు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ విభాగాల్లో విద్యార్థులు చేరేందుకు ఇష్టపడడం లేదంటూ ఆయా కళాశాలల యాజ మాన్యాలు ఏఐసీటీఈ, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించి ఆయా విభాగాల సీట్లను తగ్గించుకుని సీఎస్‌ఈలో అదనపు సీట్లకు అనుమతులు తెచ్చుకున్నాయి. కొన్ని కళాశాలలు ఏకంగా వంద సీట్లు అదనంగా తెచ్చుకున్నాయి. జేఎన్‌టీయూ అనుమతి ఇంకా లభించకపోవడంతో కౌన్సెలింగ్‌లో అదనపు సీట్ల వివరాలు వెబ్‌ఆప్షన్లలో కనిపించవు. దీంతో డొనేషన్లు చెల్లించిన విద్యార్థులు నేరుగా కళాశాలలకు వెళ్లి నిలదీస్తున్నారు.

# విద్యుత్తు భారం.. సౌర కాంతులతో దూరం

కొత్తగూడెం: బొగ్గు ఆధారిత విద్యుత్తు వినియోగాన్ని తగ్గిస్తూ.. సౌర విద్యుత్తును కాలక్రమేణా దేశమంతటా విస్తరించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. తొలుత జిల్లాకొక గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడి ప్రతి ఇల్లు, కార్యాలయం, వ్యవసాయ బోర్లు సహా అవసరమైన అన్ని వనరులకు సౌర విద్యుత్తు సదుపాయం కల్పించాలని రాష్ట్రాలకు సూచించింది. ఈ పథకం కింద ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఒక్కో గ్రామంలో పూర్తిస్థాయిలో సౌర విద్యుత్తు అందుబాటులోకి రానుంది. గ్రామ పంచాయతీలకు విద్యుత్తు బిల్లుల భారం తొలగిపోనుంది. వీధి దీపాలు, ప్రభుత్వ కార్యాలయాలు, మోటరు పంపుసెట్లు, ఇతరత్రా విద్యుత్తు వినియోగానికి ఏటా అధిక మొత్తంలో పంచాయతీ నిధుల నుంచి ఛార్జీలు చెల్లిస్తున్న విషయం విదితమే.

**డీఎల్‌సీకి ఎంపిక బాధ్యత**

గ్రామం ఎంపిక మొదలుకొని ప్లాంటు ఏర్పాటు, ఉత్పత్తి, వినియోగంపై పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీ(డీఎల్‌సీ)ని ప్రభుత్వం నియమించనుంది. ఎంపికైన గ్రామంలో ప్లాంటు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాయం (గ్రాంటు)గా రూ.కోటి మంజూరు చేయనుంది. పెద్ద పరిశ్రమలు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద ఖర్చుపెట్టే నిధులను సేకరించి ఈపథకం అమలుకు వినియోగించుకోవచ్చు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలుచేయాల్సి ఉంటుంది.

**పీఎం సూర్యఘర్‌కు స్పందన అంతంతే..**

దేశవ్యాప్తంగా కోటి ఇళ్లపై సౌర విద్యుత్తు ప్లాంట్లు నెలకొల్పాలనే



లక్ష్యంతో 'ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన'ను కేంద్రం అమలుచేస్తోంది. ఈపథకం కింద ఒక్కో యూనిట్‌కు రూ.78వేలు రాయితీగా అందిస్తోంది. అయినా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రజల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఇప్పటివరకు ఉభయ జిల్లాల్లో 500పైగా దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వీరిలో కొందరు మాత్రమే సోలార్ యూనిట్లు అమర్చుకున్నారని తెలిపారు.

**ఇలా చేస్తే మేలు..**

ఒక ఇంట్లో మూడు కిలోవాట్ల విద్యుదుత్పత్తికి అవసరమైన సౌర ప్లాంటు ఏర్పాటుకు పీఎం సూర్యఘర్ యోజన కింద కేంద్రం రాయితీ ఇస్తుంది. మిగిలిన సొమ్మును విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కం)లు పెట్టుబడిగా పెడితే ఉభయ జిల్లాల్లోని అన్ని గృహసముదాయాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయవచ్చు. గ్రామ అవసరాలకు ఎలాగూ కేంద్రం రూ.కోటి ఇస్తుండటంతో ప్రతి పల్లెలో సోలార్ విద్యుదుత్పత్తికి అవకాశముంటుంది. అంతేకాకుండా ప్రస్తుతం గృహజ్యోతి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి 200 యూనిట్ల వరకు డిస్కంలకు బిల్లులు చెల్లిస్తుంది. ఈ మొత్తాన్ని డిస్కంలు సౌర విద్యుత్తుపై పెట్టుబడి పెడితే గ్రామాలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా అవుతుంది. డిస్కంలకు విద్యుత్తు కొనే భారం తగ్గుతుంది. గ్రామాల్లో ప్రజలు వాడుకోగా మిగిలిన విద్యుత్తును డిస్కంలు తక్కువ మొత్తానికే కొనొచ్చు. 'జిల్లాకొక గ్రామానికి పూర్తిస్థాయిలో సౌర విద్యుత్తు అందించాలనే పథకానికి సంబంధించి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. రాగానే తదుపరి చర్యలు చేపడతాం' అని ఉమ్మడి జిల్లా రెడ్కో మేనేజర్ జేఎస్ఎన్ మూర్తి'కు తెలిపారు.



# నేటి నుంచి చెత్త పన్ను రద్దు

అమరావతి: రాష్ట్ర ప్రజలకు ఏపీ సీఎం చంద్రబాబు గుడ్‌న్యూస్ చెప్పారు. నేటి నుంచి చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఎక్కడా చెత్తపన్ను వసూలు చేయొద్దని అధికారులను ఆదేశించారు. గాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నంలో నిర్వహించిన స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

"మహాత్మా గాంధీ అహింసా సిద్ధాంతంతో ముందుకెళ్లారు. బానిసత్వం వద్దు.. స్వాతంత్ర్యమే ముద్దు అని నినదించారు. 2014 అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్‌కు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. దీనికి అందరం ఆయనకు అభినందనలు చెప్పాలి. నీతి ఆయోగ్‌లో స్వచ్ఛభారత్‌పై ఉపసంఘం ఏర్పాటు చేశారు. దీనికి నేను ఛైర్మన్‌గా ఉన్నాను. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్ర మానికి శ్రీకారం చుట్టాను. 2లక్షలకు పైగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాం. ఏపీని ఓడీఎఫ్ రాష్ట్రంగా మార్చాం. రాష్ట్రంలో 2019లో వచ్చిన ప్రభుత్వం వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది. రోడ్లపై 85లక్షల మెట్రిక్ టన్నుల చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. సంవత్సరం లోపు చెత్త మొత్తం శుభ్రం చేయించాలని పురపాలక మంత్రి నారాయణను ఆదేశించాం. స్వచ్ఛ ఆంధ్రప్రదేశే ధ్యేయంగా ముందుకెళ్లాలి. 2029 నాటికి ఈ లక్ష్యానికి చేరుకోవాలి. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సేవకులు కావాలి. భవిష్యత్తులో రోడ్లపై చెత్త ఉండకూడదు. ప్రజల ఆరోగ్యం బాగుందంటే దానికి కారణం స్వచ్ఛ సేవకులే. కొందరు స్వార్థ పరులు ఆంధ్ర జాతీయ కళాశాలను కబ్జా చేశారు. ప్రభుత్వం దాన్ని స్వాధీనం చేసుకుంటుంది. జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య పేరు మీద వైద్యకళాశాల ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు అన్నారు.



# ప్రాయశ్చిత్త దీక్ష విరమించిన పవన్

తిరుమల: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుమార్తెలు ఆద్య, పొలెనా అంజన, దర్శకుడు త్రివిక్రమ్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయితో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు.

అనంతరం ప్రాయశ్చిత్త దీక్షను విరమించారు. గొల్ల మండపంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. తితిదే అధికారులు పవన్‌కు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత ఆయన తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రానికి వెళ్లి పరిశీలించారు. తిరుమల లడ్డూ కల్తీ నేపథ్యంలో పవన్ ఇటీవల ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టారు. 11 రోజుల పాటు దీన్ని కొనసాగించారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి మంగళవారం సాయంత్రం తిరుపతి చేరుకున్న ఆయన.. అలిపిరి మెట్లమార్గం నుంచి కాలినడకన తిరుమలకు వచ్చారు.

**వారాహి డిక్లరేషన్ బుక్‌తో పవన్ :** శ్రీవారి దర్శనానంతరం పవన్ కల్యాణ్ వారాహి డిక్లరేషన్ బుక్‌తో వెలుపలకు వచ్చారు. చేతిలో ఎర్ర పుస్తకం ఉండటంతో భక్తులు ఆసక్తిగా గమనించారు. కాలినడక సమయంలోనే ఆయన తన వెంట డిక్లరేషన్ పుస్తకం తీసుకువచ్చారు. దర్శనానికి వెళ్లిన సమయంలో వెంట తీసుకెళ్లారు.

# లడ్డూ వివాదానికి మతం రంగు పూయడం సరికాదు

విశాఖపట్నం, అక్టోబర్ 2: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని నగరంలో ఉన్న గాంధీ విగ్రహానికి నివాళు లర్పించేందుకు ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విశాఖకు వచ్చారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో షర్మిలకు కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ విషయంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే.. ఈ వ్యవహారాన్ని కేంద్రం దర్యాప్తు చేయాలని అన్నట్టుగా ఉందన్నారు. తిరుమల లడ్డూ విషయంలో సీబీఐ ఎంక్వయిరీ వెయ్యాలని అందరికంటే ముందు కాంగ్రెస్ పార్టీ అడిగిందన్నారు. సీబీఐతో విచారణ జరిపించాలని గవర్నర్‌ను కూడా కలవడం జరిగిందన్నారు. చీఫ్ జస్టిస్ కూడా లడ్డూ విషయాన్ని సుమోటోగా స్వీకరించాలని కాంగ్రెస్ పార్టీ లేఖ రాయడం జరిగిందని తెలిపారు. సుప్రీంకోర్టు కూడా తమతో పాటు ఏకీభవిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ లడ్డూ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయం చేయొద్దని కాంగ్రెస్ పార్టీ ముందే చెప్పిందన్నారు." ఒకరేమో శాంతి పూజలు అంటున్నారు.. మరొకరేమో పశ్చాత్తాప దీక్షలంటున్నారు.. ఇంకొకరేమో ప్రక్షాళన పూజలు అంటున్నారు.. ఇలా



ఒక్కొక్కరు ఒక్కొక్క పేరు పెట్టుకొని ఈ విషయానికి మతం రంగు పూస్తున్నారు ఇది సరికాదు" అంటూ వైఎస్ షర్మిల వ్యాఖ్యలు చేశారు.

**గాంధీజీకి నివాళులు..** కాగా... ఎయిర్‌పోర్టు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్న షర్మిలను అక్కడ ఏర్పాటు చేసిన గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దీక్షలో షర్మిల పాల్గొన్నారు. కాగా.. నగరంలో గాంధీ జయంతి కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నారు. పార్టీలకు అతీతంగా నేతలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# గాంధీజీ జయంతి సందర్భంగా మంత్రి లోకేష్ నివాళి..

అమరావతి: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ బాపూజీకి ఘనంగా నివాళులర్పిస్తూ ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు చేశారు. సత్యం, అహింస ఆయుధాలుగా భారత దేశపు స్వేచ్ఛా స్వాతంత్ర్య సమరాన్ని ముందుండి నడిపిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఘనంగా నివాళులర్పించారు. స్వరాజ్యం సాధించిన బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేయడమే మన కర్తవ్యం కావాలన్నారు. సమాజ హితమే అభిమతంగా తన జీవితాన్నే త్యాగం చేసిన మహాత్ముడు నడిచిన మార్గం మనకు స్ఫూర్తి అంటూ మంత్రి లోకేష్ వ్యాఖ్యానించారు. కాగా రెండు రోజుల క్రితం 'క్లీన్ అండ్ గ్రీన్'లో భాగంగా మంగళగిరిలో పరిసరాల పరిశుభ్రతకు మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరిలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఈ పనులను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తానని లోకేష్ తెలిపారు. కార్మికులను నియమించి గడ్డి తొలగింపు పనులకు మంత్రి లోకేష్ చర్యలు తీసుకున్నారు. సొంతంగా 5 గడ్డి తొలగింపు మిషన్ల కొనుగోలుతో పాటు ప్రతి నెలా కార్మికులకు జీతాలు చెల్లించనున్నారు. మంత్రి లోకేష్ ఆదేశాలతో నియోజకవర్గంలో రోడ్లకు ఇరువైపులా గడ్డి, పిచ్చిమొక్కల తొలగింపు పనులు వేగంగా జరుగుతున్నాయి. మంత్రి చూపిస్తున్న చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా వరద బాధితుల కోసం విరాళాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. బాధితులను ఆదుకునేందుకు మరికొంతమంది ప్రముఖులు ముందుకొచ్చారు. సోమవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కలిసి ప్రముఖులు విరాళాలు అందజేశారు. విజయవాడకు చెందిన ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్ మెంట్స్ అసోసియేషన్ (ఐసీఎమ్ఏ) ప్రతినిధులు రూ.50 లక్షల విరాళం అందజేశారు. అనంతపురానికి చెందిన కేఎమ్ షకీల్ షఫీ నేతృత్వంలో ఏపీ వక్ఫ్ ఇన్ స్టిట్యూషన్స్, ముతవల్లీస్ అండ్ మేనేజింగ్ కమిటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.7,86,000 విరాళంగా అందజేశారు. తెనాలి పిడపర్తిపాలెంకు చెందిన అరుణోదయ మహిళా గ్రూప్




ఆధ్వర్యంలో రూ.1,21,000 విరాళం అందించారు. అలాగే మచిలీపట్నంకు చెందిన ఎమ్.ధనలక్ష్మి రూ.లక్ష విరాళం, అనంతపురానికి చెందిన గుండిగ నాగరాజు రూ.10 వేలు విరాళం ఇచ్చారు. కష్టాల్లో ఉన్న వారికి తమవంతు సాయం అందించిన దాతలకు మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. కొద్దిరోజుల క్రితం గుంటూరుకు చెందిన దామచర్ల శ్రీనివాసరావు ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.6,01,116 , అమలాపురానికి చెందిన బోనం వెంకట చలమయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ బోనం కనకయ్య రూ.5 లక్షలు, నంద్యాలకు చెందిన ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఎండీ ఎస్.దినేష్ రెడ్డి, కాలేజీ డీన్ బి.సూర్యప్రకాశ్ రెడ్డి రూ.4 లక్షలు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నేతృత్వంలో ప్రజలు, వివిధ సంస్థల నుంచి సేకరించిన విరాళం రూ.2,95,000, నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ప్రతినిధి జయకుమార్ రూ.2,50,000, మదనపల్లెకు చెందిన గోల్డెన్ వాలీ ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ ఎన్.వి రమణారెడ్డి, కట్టా దొరస్వామి నాయుడు రూ.2 లక్షలు, అనంతపురానికి చెందిన వి.సురేష్ నాయుడు లక్ష రూపాయలు, బీజేపీ మజ్దూర్ విభాగం నాయకుడు నాగేశ్వరరావు రూ.10వేలు అందజేశారు. కాగా కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు తమవంతు సాయం అందించిన వారికి మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.



# ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు వద్దు!

ఇరాన్- ఇజ్రాయెల్‌ల మధ్య యుద్ధంతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. మంగళవారం ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర దాడులు చేసింది. ఈనేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం ఓ కీలక ప్రకటన చేసింది. ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. 'యుద్ధ ప్రాంతాల్లోని భద్రతా పరిస్థితులను మేము నిశితంగా పరిశీలిస్తున్నాం. భారత పౌరులు ఇరాన్‌కు అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండాలి. ప్రస్తుతం ఇరాన్‌లో నివసిస్తున్నవారు అప్రమత్తంగా ఉండాలి.

అవసరమైతే టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరపాలి' అని కేంద్రం పేర్కొంది.

# తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చిన పవన్ కుమార్తె



**తిరుమల: ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిన్న కుమార్తె పొలెనా అంజన తిరుమల శ్రీవారి దర్శనానికి డిక్లరేషన్ ఇచ్చారు. తితిదే ఉద్యోగులు తీసుకొచ్చిన డిక్లరేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. పొలెనా మైనర్ కావడంతో ఆమె తరఫున తండ్రిగా పవన్ కూడా ఆయా పత్రాలపై సంతకాలు పెట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలను జనసేన పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.**

# అరసవిల్లిలో భక్తులకు కనువిందు చేసిన అద్భుత దృశ్యం...

శ్రీకాకుళం జిల్లా: అరసవిల్లిలో అద్భుత దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. శ్రీ సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో ఈ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఆలయంలోని రెండవ రోజు బుధవారం ఉదయం స్వామి వారి మూలవిరాట్టును సూర్యకిరణాలు నేరుగా తాకాయి. లేలేత సూర్య కిరణాల స్పర్శతో స్వామి వారి మూలవిరాట్ దేదీప్యమానంగా వెలుగొందింది. రెండు నిమిషాలు పాటు సూర్య కిరణాలు స్వామి వారి మూల విరాట్‌ను తాకాయి. ఈ అద్భుత దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రతి ఏటా దక్షిణాయంలో అక్టోబర్ 1, 2 తేదీలు, ఉత్తరాయణంలో మార్చి 9,10 తేదీల్లో మూల విరాట్‌ను సూర్యకిరణాలు నేరుగా తాకుతాయి. ప్రత్యక్షదైవం.. ఆరోగ్యప్రదాత.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని ఉదయభానుని లేలేత కిరణాలు తాకాయి. ఈ అపురూప ఘట్టం మొదటి రోజు మంగళవారం ఉదయం ఆవిష్కృతమైంది. ఉదయం 6.05 నిమిషాలకు సూర్యకిరణాలు గోపురాన్ని దాటుకుంటూ అనివెట్టి మండపం, ధ్వజస్తంబం మీదుగా, ఆలయ పంచద్వారాలను దాటుకుంటూ, గర్భగుడిలోని స్వామి మూలవిరాట్‌ను తాకాయి. ఈ కమనీయ దృశ్యాన్ని అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి.. పులకించారు. ఓం నమో సూర్యదేవాయ అనే నామస్మరణ మార్మోగింది. రెండేళ్లుగా




వాతావరణంలో మబ్బుల కారణంగా ఆదిత్యుడికి కిరణాలు స్పృశించేవి కాదు. దీంతో భక్తులు నిరాశ చెందేవారు. ఈ సారి మాత్రం కిరణాలు తాకడంతో స్వామి స్వర్ణ కాంతులతో దర్శనమిచ్చారని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ ఏటా మార్చి నెల 9, 10 తేదీల్లో, అక్టోబరు 1, 2 తేదీల్లో స్వామి మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకుతాయని తెలిపారు. ఈసారి కిరణస్పర్శతో అత్యంత ప్రకాశవంతంగా స్వామి దర్శనమిచ్చారన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యూహకర్త టు రాజకీయ నేత.. కొత్త పార్టీ ప్రకటించిన పీకే



దిల్లీ: ఎన్నికల మాజీ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కొత్త రాజకీయ పార్టీని బుధవారం అధికారికంగా ప్రారంభించారు. 'జన్ సురాజ్ పార్టీ' పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన.. తమ పార్టీ రెండేళ్లుగా క్రియాశీలంగా ఉందని, ఎన్నికల సంఘం నుంచీ ఆమోదం పొందిందని వెల్లడించారు. దీంతో బిహార్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతుందని అన్నారు. "కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించాం. అయితే.. ఈ పార్టీకి నాయకత్వం మాత్రం నా చేతుల్లో లేదు. రెండేళ్లుగా దీని కోసం శ్రమించిన వారే ఈ నిర్ణయం తీసుకుంటారు" అని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. "గత 30 ఏళ్లుగా బిహార్ ప్రజలు ఆర్జేడీ లేదా జేడీయూ లేదా భాజపాకు మాత్రమే ఓటు వేస్తున్నారు.

ప్రస్తుతం ఈ సంప్రదాయం అంతం కావాలి. మా పార్టీ రాజవంశానికి చెందినది కాదు" అని అన్నారు. జన్ సూరజ్ పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించినట్లు వెల్లడించారు. భాజపాతో కలిసి తమ పనిచేస్తుందంటూ కొన్ని విపక్షాలు చేస్తోన్న ఆరోపణలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. బిహార్ విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పునకు పిలుపునిచ్చిన పీకే.. విద్యారంగంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలను సాధించేందుకు రాబోయే పదేళ్లలో రూ.5లక్షల కోట్లు అవసరమవుతాయని చెప్పారు.

# విజయవాడలో కుండపోత వర్షం.. రోడ్లు జలమయం

విజయవాడ: నగరంలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు బ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల ప నులకు అంతరాయమేర్పడింది. ప్ర ధాన రహదారుల్లోని లోతట్టు ప్రాంతా ల్లోకి చేరిన వర్షపు నీటిని తొలగించేందుకు వీఎంసీ సిబ్బంది రంగంలోకి దిగారు.



# రష్మిక వాలు జడ జారు ముడి కథేంటో కానీ..!

అందాల కథానాయిక రష్మిక మందన్న తదుపరి పుష్ప 2లో శ్రీవల్లి పాత్రతో మ్యాజిక్ ని రిపీట్ చేసేందుకు దూసుకొస్తోంది. పుష్ప రాజ్ ప్రేమికురాలు శ్రీవల్లిగా అద్భుతమైన ఫాలోయింగ్ ని తెచ్చుకున్న రష్మిక, ఆ వెంటనే యానిమల్ లోను రణబీర్ భార్యగా అద్భుత నటనతో కట్టి పడేసింది. ఇప్పుడు నేషనల్ క్రష్ రష్మికకు ఉత్తరాదినా భారీ ఫాలోయింగ్ ఏర్పడింది. చాలా మంది సీనియర్ హీరోయిన్లు సాధించలేనిది రష్మిక చాలా సులువుగా సాధించి లక్కీ గాళ్ అని నిరూపించింది. మరోవైపు రష్మిక హిందీ–తెలుగులో వరుస ప్రాజెక్టులకు కమిటవుతూ ఫుల్ బిజీగా ఉంది. ప్రస్తుతం ఏ.ఆర్ మురుగదాస్ – సల్మాన్ కాంబినేషన్ మూవీ సికందర్ లో నటిస్తోంది.



ఈ మూవీ మరో పాథ్ బ్రేకింగ్ హిట్ అవుతుందని రష్మిక ఆశిస్తోంది. కెరీర్ మ్యాటర్ అటుంచితే రష్మిక సోషల్ మీడియాల్లో నిరంతరం తన అభిమానులకు టచ్ లో ఉంది. ఎప్పటికప్పుడు అద్భుతమైన ఫోటోషూట్లను ఈ భామ షేర్ చేస్తోంది. తాజాగా రష్మిక సాంప్రదాయబద్ధమైన డిజైనర్ దుస్తుల్లో కనిపించింది. బ్యాక్ లెస్ లుక్.. జారు ముడి వేసిన బ్లౌజ్ అందాన్ని ఎలివేట్ చేసింది. అలాగే తన అందమైన వాలుజడను అంతే అందంగా ప్రదర్శించింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. యువతరం వాట్సాపుల్లోనూ వేగంగా వైరల్ అయింది. శ్రీవల్లినా మజాకానా? అంటూ యూత్ కిరాక్ కామెంట్స్ తో రెచ్చిపోతున్నారు.

## రాజమౌళి, త్రివిక్రమ్.. పూజ ఛాయిస్ కు కారణమేంటో?

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డేకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఒకప్పుడు వరుస సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా గడిపిన అమ్మడు.. ఇప్పుడు అడపాదడపా చిత్రాల్లో యాక్ట్ చేస్తోంది. మంచి హిట్ అందుకుని రెండేళ్లు దాటిపోయంది. గతేడాది కిసీ కా భాయ్ కిసీ కీ జాన్ సినిమాతో సరిపెట్టుకున్న పూజ.. ఇప్పుడు మళ్లీ బిజీ అవ్వడానికి ట్రై చేస్తోంది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో సూర్యతో పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ గా రానున్న పాన్ ఇండియా మూవీలో నటిస్తోంది. లవ్ అండ్ వార్ నేపథ్యంలో రూపొందుతున్న సూర్య44కు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. సినిమాలో సూర్య గ్యాంగ్ స్టర్ గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ ప్రాజెక్ట్ కు గాను



తన షూటింగ్ పార్ట్ ను రీసెంట్ గా పూజ కంప్లీట్ చేసుకుంది. ఆ విషయాన్ని ఆమెనే తెలిపింది. దీంతోపాటు బాలీవుడ్ షాహిద్ కపూర్ తో యాక్షన్ మూవీ దేవా చేస్తోంది పూజా హెగ్డే. కాంచన–4 మూవీలో కూడా ఆమె నటించనున్నట్లు కొద్ది రోజులుగా ఇండస్ట్రీలో వార్తలు వినిపిస్తున్నాయి. ఇదంతా పక్కన పెడితే.. రీసెంట్ గా అబుదాబిలో ఐఫా అవార్డుల వేడుక జరిగిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమంలో పాల్గొన్న పూజ మీడియాతో మాట్లాడింది. రాజమౌళి, త్రివిక్రమ్ మూవీస్ లో ఒకేసారి సినిమా చేసే ఛాన్స్ వస్తే.. ఎవరి ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇస్తారని అడిగిన ప్రశ్నకు రాజమౌళి పేరు చెప్పింది పూజ. ఇద్దరూ తనకు ఫేవరేట్ అన్న అమ్మడు.. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రాజమౌళితో వర్క్ చేయలేదని, అందుకే ఆయన పేరు చెప్పానని తెలిపింది. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ గా మారాయి. దీంతో ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తున్నారు. త్రివిక్రమ్ అసూయ పడేలా చేయడానికి పూజ అలా చెప్పిందని కొందరు నెటిజన్లు అంటున్నారు. అందుకు కారణం కూడా ఉందని చెబుతున్నారు. గుంటూరు కారం సినిమా విషయంలో జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. మరికొందరు మాత్రం పూజా హెగ్డే వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని చెబుతున్నారు. త్రివిక్రమ్, పూజ తొలిసారి జూనియర్ ఎన్టీఆర్ అరవింద సమేత వీర రాఘవ మూవీ కోసం వర్క్ చేశారు. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో బ్లాక్ బస్టర్ గా నిలిచిన అల్లు అర్జున్ అల వైకుంఠపురములో మూవీలో పూజకు మళ్లీ ఛాన్స్ ఇచ్చారు త్రివిక్రమ్. ఆ తర్వాత మహేష్ బాబు గుంటూరు కారంతో వారి కాంబో రిపీట్ అవుతుందనుకుంటే.. కొన్ని కారణాల వల్ల అమ్మడు తప్పుకుంది. ఏదేమైనా ఇప్పుడు త్రివిక్రమ్, రాజమౌళిలో ఒకరి ప్రాజెక్ట్ పూజ ఎంచుకున్న విషయం హాట్ టాపిక్ గా మారింది!




# కార్తీ 'సత్యం సుందరం'.. థియేటర్స్ లోకి మళ్ళీ కొత్తగా..



కార్తీ తాజా తమిళ చిత్రం తెలుగులో 'సత్యం సుందరం' అనే పేరుతో విడుదలైన విషయం తెలిసిందే. 96 ఫేమ్ ప్రేమ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా మానవ సంబంధాలను చుట్టూ తిరిగే కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది, అయితే ప్రేక్షకుల నుండి వచ్చిన ప్రధాన ఫీడ్‌బ్యాక్ లో సినిమా నిడివి గురించి కొంత అసంతృప్తి వ్యక్తమైంది. ఈ సినిమా మొత్తం రన్ టైమ్ 2 గంటల 57 నిమిషాలు. ఇది కొన్ని చోట్ల మరింత సుదీర్ఘంగా అనిపించిందని, ప్రేక్షకులకు బాగానే కనెక్ట్ అయినప్పటికీ, మరింత ఎంగేజింగ్‌గా మారాలంటే ట్రిమ్మింగ్ చేయాల్సిన అవసరం ఉందని అనిపించిందని సమాచారం.

ఇక ప్రేక్షకుల నుండి వచ్చిన ఈ ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని, చిత్ర బృందం సినిమా నిడివి తగ్గించడానికి నిర్ణయం తీసుకుంది. సినిమా విడుదలైన కొన్ని రోజులకే, జాగ్రత్తగా అన్ని వైపుల నుండి వచ్చిన సలహాలను పరిశీలించి, మూవీని దాదాపు 18 నిమిషాలు కత్తిరించాలని మేకర్స్ నిర్ణయం తీసుకున్నారు. ట్రిమ్ చేసిన కొత్త వెర్షన్ లో సినిమా మరింత బలమైన కథనంతో ముందుకు సాగుతుందని, సుదీర్ఘంగా ఉండే కొన్ని సన్నివేశాలను తీసేయడం ద్వారా ప్రేక్షకులకు మరింత ఆసక్తికరంగా మారుతుందని భావిస్తున్నారు. తాజాగా ట్రిమ్మింగ్ చేసిన 'మేయళగన్' వెర్షన్ థియేటర్లలోకి విడుదలైంది. ఇప్పుడు ఇదే మార్పును తెలుగు వెర్షన్ అయిన 'సత్యం సుందరం'కీ వర్తింపజేయనున్నారు. తెలుగు ప్రేక్షకులకు కూడా అదే విధంగా కథ మరింత కట్టిపడేయడంలో సాయపడుతుందని చిత్ర బృందం ఆశాభావం వ్యక్తం చేసింది. అయితే, ఈ విషయంపై ఇంకా అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. ఈ సినిమాలో కార్తీ, అరవింద్ స్వామి, శ్రీదివ్య, రాజ్ కిరణ్, జయప్రకాశ్, సరన్, దేవదర్శిని కీలక పాత్రల్లో నటించారు. వీరి నటనతో పాటు, సన్నివేశాల భావోద్వేగ భరితమైన ప్రదర్శన ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.

ట్రిమ్మింగ్ తర్వాత సినిమా ప్రేక్షకులను మరింత ఆకర్షించవచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక తెలుగులో సత్యం సుందరం సినిమాకు దేవర పోటీగా ఉన్న విషయం తెలిసిందే. తమిళంలో కంటే ఒక రోజు ఆలస్యంగానే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ దేవర ఇంపాక్ట్ మరుసటి రోజు కూడా చూపించింది. ఇక మరికొన్ని రోజుల్లో సెలవులు ఉన్నాయి కాబట్టి సత్యం సుందరం ఏమైనా మ్యాజిక్ క్రియేట్ చేస్తుందేమో చూడాలి.

# జాన్వీ కపూర్ కిది గ్రాండ్ లాంచింగ్!




అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ కి దేవర ఇండియన్ బెస్ట్ లాంచింగ్ మూవీ అయిందా? మాతృభాష హిందీ ని మించి తెలుగులోనే అది సాధ్యమైందా? అంటే అవుననే అనిపిస్తుంది. జాన్వీ బాలీవుడ్ లో ధడక్ తో చిత్ర పరిశ్రమకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఆ తర్వాత గుంజన్ సక్సేనాలో నటించింది. రూహీ, గుడ్ లక్ జెర్రీ, మిలీ, బవాల్, ఉలజ్, మిస్టర్ అండ్ మిస్టర్స్ మహి ఇలా కొన్ని సినిమాలు చేసింది. కానీ ఇవేవి జాన్వీ ఖాతాలో బ్లాక్ బస్టర్లగా కనిపించవు. తొలి రోజు వంద కోట్లు తెచ్చిన సినిమాల జాబితాలోనూ ఉండవు. కానీ టాలీవుడ్ నుంచి రిలీజ్ అయిన దేవర మాత్రం జాన్వీ కెరీర్ లోనే ఓ గొప్ప చిత్రంగా నిలిచి పోతుంది. ఈ సినిమా తొలి రోజు 170 కోట్ల వసూళ్లను సాధించిన సంగతి తెలిసిందే. ఇలాంటి ఓపెనింగ్ జాన్వీ చూడాలంటే? అది ఇప్పట్లో జరిగేది కాదు. అక్కడ పెద్ద పెద్ద స్టార్లకే ఇంకా సాధ్యం కాలేదు. అలాంటిది జాన్వీకి ఓ తెలుగు సినిమాతో ఈ గౌరవం దక్కడం ఆమె చేసుకున్న అదృష్టంగా చెప్పాలి. ఇది జాన్వీ మామ్ శ్రీదేవి అందించిన గిఫ్ట్ గా చెప్పాలి. శ్రీదేవి బ్రాండ్ తోనే జాన్వీకి ఈ అవకాశం వచ్చింది.

లేదంటే పనిగట్టుకుని జాన్వీనే ఎందుకు తీసుకుంటారు. అలనాటి అందాల నటి శ్రీదేవికి తెలుగు సినిమాతో ఉన్న అనుబంధం గురించి తెలిసిందే. జాన్వీ ఆమె కుమార్తె అవ్వడంతో కొరటాల– ఎన్టీఆర్ జాన్వీ అయితే ది బెస్ట్ గా ఉంటుందని ఎంపిక చేసారు. ఇప్పుడా సినిమా సక్సెస్ తో జాన్వీకి మంచి గుర్తింపు దక్కుతుంది. ఆమె పాత్రకు అంతగా ప్రాధాన్యత లేకపోయినా వసూళ్ల పరంగా దేవర దూకుడుతో ఇది సాధ్యమైంది. అయితే ఈసినిమా బాలీవుడ్ కి మాత్రం అంతగా కనెక్ట్ అవ్వలేదు.

# శనివారం బ్యూటీని గ్యాంగ్ తో వెంట పడి వేధించిన యువకుడు!

హీరోయిన్లకు అప్పుడప్పుడు ఆకతాయిలతో ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా హీరోయిన్లు క్రౌడ్ లో కి వెళ్లిన సమయంలో అసౌకర్యానికి గురవ్వుతంటారు. సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా? అలాంటి సమయంలో జనాల్ని అదుపు చేయడం అన్నది కష్టమైన పని. ఈ సమయంలో అనుకోని సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఆ సమయంలో సదరు భామలు ఆగ్రహానికి గురవుతుంటారు. అయితే %–%సరిపోదా శనివారం%–% బ్యూటీ ప్రియాంక మోహన్ ని మాత్రం తనని ఒకరు టార్గెట్ చేసి మరీ వేధిస్తున్నాడని ఆరోపించింది. తమిళ సినిమా %–%బ్రదర్%–% టీజర్ కార్యక్రమంలో అమ్మడు పాల్గోంది. అదే సమయంలో ఓ యువకుడు ప్రియాంకతో సెల్ఫీ కోసం ప్రయత్నించాడు. దీంతో ప్రియాంక ఆ యువకుడిపై ఆగ్రహం వ్యక్తం చెందింది. ఇంత జనాల్లో సెల్ఫీ ఇవ్వాలా? అంటూ సీరియస్ అయింది. ఈఘటన అక్కడ పెద్ద పెద్ద కలకలాన్నే రేపింది. సెల్ఫీ అడిగినందకు



ప్రియాంక అంత సీరియస్ అవ్వాలా? సింపుల్ గా నో చెప్పి వెళ్లపోయేదానికి అంత సీన్ క్రియేట్ చేయాలా? అనొచ్చు. అయితే అక్కడ మరో మ్యాటర్ ఉందని తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారం గురించి మరో నటి శరణ్యతో ప్రియాంక పంచుకున్న వీడియో వైరల్ అవుతుంది. అందులో ప్రియాంక ఇలా అంది. తనని చాలా రోజులుగా ఆ యువకుడు పనిగట్టుకుని వెంబడిస్తున్నాడని అంది. చివరికి తన ఇంటి వరకూ కూడా వచ్చాడని అంది. బ్రదర్ సినిమా ఈవెంట్ రోజున కూడా ఆ యువకుడు తన గ్యాంగ్ తో స్థానిక వెలచ్చేరి లోని పినిక్స్ మాల్ నుంచి తనని ఫాలో అవుతూ వచ్చాడని ఆరోపించింది. అతడు నిజంగా అభిమాని అయితే అలాంటి పనులు ఎందుకు చేస్తాడని ప్రియాంక మోహన్ అంది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. ప్రియాంక మాటల్ని బట్టి చూస్తే ఆమెని ఆ యువకుడు టార్గెట్ చేసి ఫాలో అయినట్లే కనిపిస్తుంది. మరి ఈ ఘటనపై ప్రియాంక లీగల్ యాక్షన్ తీసుకుంటుందా? అన్నది తెలియాలి.

## సమంత వాచ్ ధర ఎంతంటే?

సమంత స్టైలిష్ డిజైనర్ దుస్తుల్లో కనిపించడం రేర్. ఫోటో షూట్లు ఉంటే? తప్ప స్టైలిష్ ఎంపికల జోలికి వెళ్లదు. కానీ తనలో అంతకు మించిన ఫ్యాషన్ క్వాలిటీని మాత్రం ప్రతీ సందర్భంలో హైలైట్ చేస్తుంటుం ది. అందులో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును చాటుతుంది. సాధారణ దుస్తుల్లోనే తనలో ఫ్యాషన్ క్వాలిటీని హైలైట్ చేయడంలో సామ్ ప్రత్యేకం. తాజాగా అమ్మడు న్యూ అరైవల్స్ లో ఇలా మెరిసింది. పాస్టెల్ గ్రీన్ కో ఆర్డ్ సెట్ డిజైన్ లో ఆకర్షణీయంగా ముస్తాబైంది. డ్రెస్ మ్యాచింగ్ యాక్సరసీస్ ని ఎంపిక చేసుకుంది. అమ్మడి మ్యాకప్ అలంకరణ ఆకట్టుకుంటుంది. చెవులకు బంగారు పోగులు ధరించింది. ఇక చేతికి అమ్మడు ఖరీదైన వాచ్ ని ధరించింది. విలాసవంతమైన బల్గారీ రసర్పెంటీ వాచ్ ధరించింది. ఆ వాచ్ చేతిని మరింత అందంగా తీర్చి దిద్దింది. దీని ధర భారీగా ఉంటుందని నెటిజనులు గెస్ చేస్తున్నారు. ధర ఎంత అనే దానిపై సెర్చింగ్



సాగుతోంది. అంచనాల ప్రకారం ధర 45 లక్షలకుపైగానే ఉంటుందని సమాచారం.ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అభిమానులు సమంత బ్యూటీకి ఫిదా అవుతున్నారు. సమంత రూప లావణ్యంలో ఎలాంటి మార్పులు రాలేదని..మునుపటి అందాన్ని మెయింటెన్ చేస్తుందని ఓ అభిమాని పోస్ట్ పెట్టాడు. ఇక సమంత కెరీర్ ని మళ్లీ బిజీగా మార్చే పనిలో ఉంది. త్వరలోనే సీటాడెల్ ఇండియన్ వెర్షన్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే కొత్త సినిమాలకు రెడీ అవుతుంది. కొంత కాలంగా బాలీవుడ్ లో ఉండి అక్కడ నుంచి యాక్టివిటీస్ అన్నింటిని కొనసాగిస్తుంది.




హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. ఆయన తీరుతో సినీ పరిశ్రమలో కొంతమంది ఇబ్బంది పడ్డారన్నారు. కొందరు హీరోయిన్లు సినిమా ఫీల్డ్ నుంచి తప్పుకొంటే.. మరికొందరు త్వరగా పెళ్లి చేసుకున్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆమె మాట్లాడారు. బీసీ మహిళనైన తనపై అసభ్యకర పోస్టులు పెట్టడం బాధాకరమని కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను కించపరిచేలా పోస్టులు పెట్టాలని కేటీఆరే ఆ పార్టీ కార్యకర్తలకు చెప్పినట్లు ఉందన్నారు. "మంత్రి సీతక్క, మేయర్ గద్వాల విజయలక్ష్మిపై అసభ్యకర పోస్టులు పెట్టారు. ఐదేళ్లు భారాసలో పనిచేశా.. నా వ్యక్తిత్వం అందరికీ తెలుసు. అసభ్యకరంగా పోస్టులు పెట్టినవారిపై ఫిర్యాదు చేశాం. రాజకీయ విలువలు దిగజారిపోయాయి.

ప్రభుత్వం తప్పు చేస్తే ఎత్తిచూపాలి. వ్యక్తిత్వం దెబ్బతీసేలా ప్రవర్తించవద్దు" అని సురేఖ హితవు పలికారు.

# మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై కేటీఆర్ ఏమన్నారంటే



హైదరాబాద్, అక్టోబర్ 2: హీరోయిన్ల జీవితాలతో ఆడుకోవడం కేటీఆర్‌కు అలవాటని, అక్కినేని నాగచైతన్య – సమంత విడిపోడానికి కేటీఆరే కారణమంటూ మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "మాకు సంబంధం లేని వ్యవహారంలో కొండా సురేఖ మాపై ఏడుస్తున్నారు. నేను హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేస్తున్నానని కొండా సురేఖ అనలేదా? నాకు కుటుంబం.. భార్య.. పిల్లలు లేరా? మొదట.. కొండా సురేఖ, సీతక్కలు సీఎం రేవంత్ నోరును ఫినాయిల్‌తో కడగాలి. కొండా సురేఖపై సోషల్ మీడియా పోస్టింగ్‌లతో మాకు సంబంధం లేదు. కొండా సురేఖ ఏడిస్తే మాకేమి సంబంధం" అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో కేసీఆర్‌ను తిట్టిపోయలేదా అని అన్నారు. చేతకాకనే కాంగ్రెస్ తమపై దాడులు చేయిస్తోందని మండిపడ్డారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము లేకనే దాడులు చేయిస్తోందన్నారు.

సెక్యూరిటీ లేకుండా మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబులు మూసీ ప్రాంతంలో తిరగాలన్నారు. జగ్గారెడ్డి, మధు యాష్కీలు హైడ్రాను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య అండర్ స్టాండింగ్ ఉందని.. అందుకే పొంగులేటి ఇంటిపై ఐటీ దాడుల గురించి బీజేపీ మాట్లాడటం లేదన్నారు. మూసీ బాధితుల కోసం రేపు (గురువారం) ఎల్బీనగర్‌కు వెళుతున్నామని.. కాంగ్రెస్ వాళ్ళుఅడ్డొస్తే ఏం చేయాలో అది చేస్తామన్నారు. "మా ఆత్మరక్షణ కూడా మేము చూసుకోవాలి కదా" అని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

**మంత్రి కొండా సురేఖ కామెంట్స్ ఇవే..** అక్కినేని హీరో నాగచైతన్య, హీరోయిన్ సమంత విడిపోవడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే కారణమని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. కేటీఆర్‌కు హీరోయిన్ల జీవితాలతో ఆడుకోవడం అలవాటని.. వారికి డ్రగ్స్ అలవాటు చేసింది ఆయనేనన్నారు. బాపూఘాట్ లో గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "కేటీఆర్‌కు తల్లి, అక్క, చెల్లి లేరా. హీరోయిన్ల జీవితాలతో కేటీఆర్ ఆడుకున్నారు. మత్తుపదార్థాలు అలవాటు చేశారు. వాళ్ల ఫోన్లు ట్యాప్ చేశారు. చాలా మంది హీరోయిన్లు త్వరగా పెళ్లిళ్లు చేసుకుని సినిమా ఇండస్ట్రీ నుంచి తప్పుకోవడానికి ఆయనే కారణం. ఆయన డ్రగ్స్‌కు అలవాటుపడి వాళ్లకూ అలవాటు చేశారు. రేవ్ పార్టీలు చేసుకుని వాళ్లని బ్లాక్ మెయిల్ చేశారు. ఈ విషయం సినీ ఇండస్ట్రీలో ఉన్న అందరికీ తెలుసు. బీఆర్ఎస్ దొంగ ఏడుపులు మాకవసరం లేదు. హరీశ్ రావు మనస్సున మనిషిగా స్పందించారు. నాపై ట్రోలింగ్ జరిగినప్పుడు ఎందుకు స్పందించలేదు. మంత్రి సీతక్క, మేయర్ గద్వాల విజయలక్ష్మిపై అసభ్యకర పోస్టులు పెట్టారు. ఐదేళ్లు బీఆర్ఎస్‌లో పనిచేశా.. నా వ్యక్తిత్వం అందరికీ తెలుసు. అసభ్యకరంగా పోస్టులు పెట్టినవారిపై ఫిర్యాదు చేశాం. రాజకీయ విలువలు దిగజారిపోయాయి. ప్రభుత్వం తప్పు చేస్తే ఎత్తిచూపాలి. వ్యక్తిత్వం దెబ్బతీసేలా ప్రవర్తించవద్దు. దుబాయి నుంచి నాలుగు సోషల్ మీడియా అకౌంట్లతో నాపై ఫేక్ పోస్టులు పెడుతున్నారు"అని సురేఖ అన్నారు.

# దసరాకు 'డబుల్' బొనాంజా..

## – అర్హులకు ఇళ్ల పంపిణీ, త్వరలో విధివిధానాలు ఖరారు



హైదరాబాద్: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు దసరా పండుగ కానుకగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన 'డబుల్' ఇళ్లను దసరా కానుకగా కేటాయిస్తామని ప్రకటించారు. లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలను ఒకట్రెండు రోజుల్లో ఖరారు చేస్తామని తెలిపారు.

# ఆ పోస్టులు పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదు: ఎంపీ రఘునందన్



సంగారెడ్డి: సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు. ఒక ఆడబిడ్డను అవమానించేలా పోస్టులు పెట్టడం తగదని హెచ్చరించారు. దుబ్బాక, సిద్దిపేట, సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. సంగారెడ్డి గంజి మైదాన్‌లో గాంధీ జయంతి సందర్భంగా నివాళు లర్పించారు. స్వచ్ఛభారత్‌లో బాగంగా రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. హైడ్రా గురించి ఎవరిష్టం వచ్చినట్టు వారు అవగాహన లేకుండా మాట్లాడాతున్నారని, దీనిపై సీఎం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

హైడ్రాపై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస చేసినవన్నీ మర్చిపోయి, మా మీద నుంచి బుల్డోజర్లు వెళ్లాలని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తప్పు ఎక్కడ జరిగినా.. బుల్డోజర్లు వస్తాయని, బుల్డోజరు తప్పు చేసిన వారి మీద నుంచి తప్పకుండా వెళ్తుందని వ్యాఖ్యానించారు.

# రాహుల్ గాంధీకి.. హైడ్రాకు ఏంటి సంబంధం?: మహేశ్‌కుమార్ గౌడ్




హైదరాబాద్: భారాస అధినేత కేసీఆర్ ఎక్కడున్నారో కేటీఆర్ చెప్పాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారాస, ఆ పార్టీ నేతల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 800 చెరువులను కబ్జా చేశారు. కబ్జా చేశారు కాబట్టే ఆ పార్టీ నేతలు భయపడుతున్నారు. రాహుల్ గాంధీకి.. హైడ్రాకు ఏంటి సంబంధం? ఇంకా డీపీఆర్ రూపొందించలేదు. అలాంటప్పుడు అవినీతి ఎలా జరుగుతుంది? మూసీ ప్రక్షాళన చేసి ఆదుకుంటామని గతంలో కేసీఆరే అన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని నిర్మాణాలనే హైడ్రా కూల్చుతోంది. హైడ్రా, కూల్చివేతలపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్‌లో చెరువులకు పూర్వ వైభవం తీసుకొస్తాం" అని వెల్లడించారు.




# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. పూల పండగ విశేషాలివే

తెలంగాణ ఆడపడుచులు ఎంతో ఇష్టంగా జరుపుకునే బతుకమ్మ పండుగ రానేవచ్చేసింది. తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ ఈరోజు (బుధవారం) నుంచి ప్రారంభమయ్యాయి. తెలంగాణ ప్రజలకు ఈ పండుగ చాలా ప్రత్యేకమైంది. తెలంగాణ సంస్కృతిక ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ నేటి (అక్టోబర్ 2) నుంచి తొమ్మిరోజుల పాటు తెలంగాణ ఆడపడుచులు జరుపుకోనున్నారు. ప్రకృతి మిళితంగా.. పూలపండుగగా పిలుచుకునే బతుకమ్మను ఊరూవాడా చిన్నాపెద్ద తేడా లేకుండా ఆటపాటలతో జరుపుకుంటారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ ... బతుకమ్మపై పాటలు పాడుతూ మహిళలు పండుగ చేసుకుంటారు. ఒక్కోరోజు ఒక్కోపేరుతో బతుకమ్మను పేరుస్తారు. ఆడపడుచులు తమ అత్తవారింటి నుంచి పుట్టింటికి వచ్చి బతుకమ్మను చేస్తుంటారు. తీరొక్క పూలతో బతుకమ్మ అలంకరిస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో పండుగ మొదలవుతుంది.

**బతుకమ్మకు వాడే పూలు..** బతుకమ్మ కోసం గునుగు పూలు, తంగేడు పూలు, బంతిపూలు, చామంతి, నంది వర్ధనం ఇలా రకరకాల పూలతో బతుకమ్మకు ఉపయోగిస్తారు. ప్రతీరోజు ఒక్కో నైవేద్యాన్ని బతుకమ్మకు సమర్పిస్తారు. బతుకమ్మను పేర్చిన తర్వాత మహిళలు తోటి మహిళలతో కలిసి ఆరుబయట బతుకమ్మను వలయాకారంలో పెడతారు. బతుకమ్మ చుట్టూ మహిళలు చప్పట్లు కొడుతూ తిరుగుతూ పాటలు పాడుతుంటారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మకు సంబంధించి అనేక పాటలు పాడతారు. తొలుత బొడ్డెమ్మతో మొదలుకుని ఎంగిలిపువ్వు బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిరోజుల పాటు బతుకమ్మను పేరుస్తారు. మొదటి ఎనిమిది రోజుల పాటు మహిళలు రోజూ బతుకమ్మ చేసి... సాయంత్రం వేళ ఇంటి బయట పెట్టి దాని చుట్టూ పాటలు పాడుతూ తిరిగి దగ్గరలో ఉన్న జలాలలో నిమజ్జనం చేస్తారు. చివరి రోజు సద్దుల బతుకమ్మను మాత్రం మహిళలు అత్యంత కోలాహలంగా జరుపుకుంటారు.

**సద్దుల బతుకమ్మ ప్రత్యేకత...** తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ పండుగలో చివరి రోజు మాత్రం అత్యంత ప్రత్యేకమైనది. బతుకమ్మకు అవసరమైన పూలను తెచ్చుకుని మహిళలు బతుకమ్మను తయారు చేస్తుంటారు. ఎంత పెద్దగా బతుకమ్మ ఉంటే అంత గొప్పగా భావిస్తుంటారు మహిళలు. ముందుగా ఒక పల్లెంలో మోదుగాకు పరిచి.. దానిపై కుంకమ, పసుపు వేస్తారు. ఆ తరువాత గునుగు పువ్వును ఒక వరుసగా పేర్చి.. దానిపై బంతిపూలు, చామంతులు ఇలా అనేక రకాల రంగు రంగుల పూలతో పేరుస్తారు. అలాగే గునుగు పువ్వుకు రంగులు అద్ది పేరుస్తుంటారు. అలాగే బతుకమ్మ మధ్యలో వివిధ రకాల పూల రెక్కలు, ఆకులతో నింపుతుంటారు. ఈ విధంగా త్రికోణంలో అతి పెద్దగా.. తీరొక్క పువ్వుతో బతుకమ్మను పేరుస్తారు. బతుకమ్మను పేర్చిన తర్వాత గౌరమ్మను చేసి పెడతారు. బతుకమ్మ పూర్తి అయిన తరువాత దేవుడి మందిరంలో పెట్టి అగరుబత్తులతో పూజ చేసి.. ఐదు రకాల నైవేద్యాలు సమర్పిస్తారు. అనంతరం సద్దుల బతుకమ్మ రోజు సాయంత్రం వాకిట్లో పెద్ద పెద్ద ముగ్గులు వేసి.. మహిళలు తమ బతుకమ్మలను అక్కడ ఉంచుతారు. తోటి మహిళలతో కలిసి బతుకమ్మ పాట పాడతారు. ఒక్కో ఇంటి ముందు ఐదేసి (అంతకు మించి) పాటలు పాడుతూ ఎంతో ఉత్సాహంగా పండుగ జరుపుకుంటారు మహిళలు. ఆపై తమ తమ బతుకమ్మలను దగ్గరలో ఉన్న చెరువులల్లో కానీ, బావిలో కానీ నిమజ్జనం చేస్తారు. ఆపై పల్లెంలో తెచ్చిన చెరువు నీటితో మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకుని తాము చేసిన ప్రసాదాలను పంచుకుంటారు. ఇంతటితో బతుకమ్మ సంబరాలు ముగుస్తాయి.




హైదరాబాద్: ప్రజల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ప్లాట్లుగా మార్చి అమ్ముకున్న చరిత్ర భారాస పార్టీదని మంత్రి సీతక్క ఆరోపించారు. బుధవారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన సరస్ ఫెయిర్–2024 బతుకమ్మ వేడుకల్లో సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. "కేటీఆర్.. చాట్ చాట్‌గా కాదు డైరెక్ట్‌గా వచ్చి మాట్లాడు. పండుగపూట కూడా అనవసరంగా మమ్మల్ని విమర్శిస్తున్నారు. రాహుల్ గాంధీ కుటుంబం త్యాగం, కష్టం, నిజాయితీ ముందు మీరెంత? రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కేటీఆర్‌ది కాదు. బీసీ, ఎస్టీ మంత్రులుగా ఆర్థిక నేపథ్యంతో కాకుండా.. స్వతంత్రంగా ఎదిగాం. మేం సమ్మక్క సారలమ్మ, రాణి రుద్రమ ప్రాంతాల నుంచి వచ్చాం. ఎందుకు మా మీద అక్కసు. వరదల్లో మునిగి ప్రజలు నష్టపోవద్దని ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. మూసీ కూల్చివేతల అంశంలో పేదలకు నష్టం రాకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చెప్పారు. అసభ్యకరంగా దూషించి మమ్మల్ని శిఖండి అని ఎలా అంటారు? గతంలో మహిళా మంత్రుల చరిత్ర, ఇప్పటి మహిళా మంత్రుల చరిత్ర ప్రజలకు తెలుసు. మేం నామినేట్ చేస్తే అప్పనంగా వచ్చినోళ్లం కాదు. ప్రజల చేత ఎన్నుకున్న మంత్రులం. పనిగట్టుకొని మేం సినిమావాళ్ల గురించి మాట్లాడలేదు. ఎవరి వ్యక్తిగత జీవితం వాళ్లకు ఉంటుంది. సందర్భాన్ని బట్టి కొంత మంది సినీ ప్రముఖలపై మాత్రమే మాట్లాడారు. సినీ నటులకు మేం వ్యతిరేకం కాదు.. వాళ్లను ద్వేషించడం లేదు. పండగపూట ప్రజలు, ఆడబిడ్డలను ఆనందంగా ఉంచాలి. తెలంగాణ మహిళలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు. బతుకమ్మ అంటేనే చెరువులను పూజించే పండుగ.. పూలను పూజించే పండుగ. ఆడబిడ్డలు పుట్టింటికి వచ్చి కష్టాలు పంచుకునే పండుగ బతుకమ్మ. కనీసం ఈ తొమ్మిది రోజులైనా ఆడబిడ్డలను స్వేచ్ఛగా ఆడుకోనివ్వండి. ఉద్యోగ, రాజకీయాల్లో ఉన్నత స్థానానికి వచ్చే విధంగా కుటుంబాలు ప్రోత్సహించాలి.. అండగా ఉండాలి" అని మంత్రి సీతక్క అన్నారు.




హనోయి: దక్షిణ వియత్నాంలో బర్డ్‌ఫ్లూ వైరస్ (హెచ్5ఎన్1) తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వైరస్ బారిన పడి పలు జూలలో 47 పులులు, మూడు సింహాలు, ఒక పాంథర్ మృతిచెందినట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో ఈ మరణాలు చోటుచేసుకున్నట్టు వియత్నాం న్యూస్ ఏజెన్సీ (%ఎచీూ%) పేర్కొంది.లాంగ్ యాన్ ప్రావిన్స్‌లోని ప్రైవేట్ మై క్విన్ సఫారీ పార్క్, హెూచి మిన్ సిటీకి సమీపంలోని డాంగ్ నైలోని వూన్ జోయ్ జూలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటి శాంపిల్స్‌ను నేషనల్ సెంటర్ ఫర్ యానిమల్ హెల్త్ డయాగ్నోసిస్‌కు పంపగా.. హెచ్5ఎన్1 టైప్ ఎ రకం కారణంగానే జంతువులు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ మరణాలపై స్పందించేందుకు ఆయా జంతు ప్రదర్శనశాలలు నిరాకరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఈ జంతువులతో దగ్గరగా ఉన్న జూ సిబ్బంది ఎవరికీ శ్వాసకోశ సమస్యలు ఏర్పడలేదని పేర్కొంది. 2004లో కూడా బర్డ్‌ఫ్లూ కారణంగా థాయిలాండ్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద బ్రీడింగ్ ఫార్మ్‌లో డజన్లకొద్దీ పులులు మృత్యువాతపడ్డాయి. వియత్నాంలో 2023 చివరి నాటికి మొత్తం 385 పులులు బందిఖానాల్లో ఉన్నట్లు ఎడ్యుకేషన్ ఫర్ నేచర్ వియత్నాం (%జుచీఎ%), వన్యప్రాణుల సంరక్షణపై పనిచేసే ఒక ఎన్జీవో పేర్కొంటున్నాయి. 310కి పైగా పులులు ప్రైవేటు ఫారమ్‌లు, జూలలో ఉండగా.. మిగతావి ప్రభుత్వానికి సంబంధించిన కేంద్రాల్లో ఉన్నట్లు నివేదికలు తెలిపాయి. క్షీరదాల్లో ప్రాణాంతక హెచ్5ఎన్1తో పాటు పలు ఇన్‌ఫ్లూయెంజా వైరస్ కేసులు 2022 నుంచి పెరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com